# రాజకీయ కక్ష సాధింపు - కోర్టు కేసులతో వేధింపులు


- ఉపోద్ఘాతం ........................................................................ 3
- కాకినాడ పోర్టు వివరాలు ........................................................ 5
- చిత్తూరు కో-ఆపరేటివ్ డెయిరీ................................................... 7
- హెరిటేజ్ ........................................................................... 9
- ఏలేరు కేసు వివరాలు ........................................................... 10
- భూకేటాయింపులను ఆమోదించిన మంత్రివర్గసంఘం ........................ 12
- విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు ................................................ 14
- ఐయంజీ ప్రాజెక్టు వివరాలు .................................................... 16
- కృష్ణా - గోదావరి బేసిన్ ....................................................... 18
- నిజాం షుగర్ ఫ్యాక్టరీ ............................................................ 20
- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్............................................................ 22
- హైటెక్ సిటీ ....................................................................... 24
- రెడ్డి ల్యాబ్స్ ........................................................................ 26
- సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ ........................................... 27
- ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్ట్ .................................................. 28
- చంద్రబాబు ఆస్తులపై ఆరోపణలు .............................................. 30
- కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన విచారణ కమిటీలు .......................... 33

# రాజకీయ కక్ష సాధింపు - కోర్టు కేసులతో వేధింపులు

**మంచి-చెడు, నీతి-అవినీతి, ధర్మం-అధర్మం, నిజం-అబద్ధం మధ్య ఎంత వ్యత్యాసం ఉందో తెలుగుదేశం పార్టీకి, కాంగ్రెస్ పార్టీకి అంత తేడా ఉంది. చంద్రబాబుకు, వైయస్ రాజశేఖరరెడ్డికి అంత భేదం ఉంది. తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా కంటిమీద కునుకు లేకుండా రాష్ట్రాభివృద్ధికి పాటుపడింది ఒకరైతే..ఐదేళ్లలోనే భూమి, జలయజ్ఞం, ఖనిజ సంపద అన్ని వనరులు (నేల, నింగి, నిప్పు..పంచభూతాల కూడా) స్వాహా చేసింది మరొకరు. రాష్ట్రానికి ధర్మకర్త (ట్రస్టీ)గా వ్యవహరించి సంస్కరణల ద్వారా చంద్రబాబు సంపద సృష్టిస్తే..తరువాత అధికారం చేపట్టిన వైఎస్సార్ సహజ వనరులను లూఠీ చేసి సొంత కొడుకు జగన్‌కు, దత్తపుత్రుడు గాలి జనార్ధనరెడ్డికి దోచిపెట్టాడు. ఈ రెండు కుటుంబాల మధ్య హస్తిమశకాంతం భేదం ఉంది. నేలతల్లినే నమ్ముకున్న రైతు కుటుంబం చంద్రబాబుదైతే, గనులు కొల్లగొట్టి నాసిరకం కాంట్రాక్టులతో, భూకబ్జాలతో వైయస్ కుటుంబం కోట్లకు పడగెత్తింది. పీజీ విద్యార్థిగానే శ్రమదానంతో స్వగ్రామంలో కాలువలు తవ్వించి, రోడ్లు వేయించింది ఒకరైతే..అవినీతి సొమ్ముతో జులాయిగా తిరుగుతూ జల్సా చేసింది మరొకరు... సంపద సృష్టికి, నిర్మాణానికి పారదర్శకతకు ఒకరు ప్రతీక అయితే..విధ్వంసానికి, విచ్ఛిన్నానికి, దోపిడీకి మరొకరు చిహ్నంగా నిలిచారు.**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 56 ఏళ్ల రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో మెరుపులు-మరకలు ఎన్నెన్నో...1956 నుండి 1983 వరకు సుదీర్ఘంగా పాలించిన కాంగ్రెస్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాలలో వెనుకబడింది, తెలుగుజాతి ఆత్మగౌరవం దెబ్బతింది. ఆంధ్రుల ఆరాధ్య దైవం నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపనతో రాష్ట్ర రూపురేఖలు మారిపోయాయి. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా సంక్షేమానికి పెద్దపీట వేసి, బడుగు, బలహీన వర్గాల రాజ్యాధికారం కోసం అహరహం పాటుపడ్డారు. ఆయన తరువాత చంద్రబాబునాయుడు తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా పలు సంస్కరణలు చేపట్టి సంపద పెంచారు, ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపారు, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నిలిపారు. 2004లో అధికారం చేపట్టిన వైయస్ రాజశేఖరరెడ్డి ఐదేళ్ల పాలనలో విచ్చలవిడి అవినీతి కుంభకోణాలతో వ్యవస్థలను విచ్ఛిన్నం చేశారు. ప్రభుత్వంలో పనులు కావాలంటే కొడుకు కంపెనీలలో అధిక ధరలకు షేర్లు కొనాలి, లేదా వారి కంపెనీల్లో భాగస్వామ్యం ఇవ్వాలి, భారీ ఎత్తున ముడుపులివ్వాలనే త్రిసూత్ర ప్రణాళికతో రూ.లక్ష కోట్లు దోపిడికి పాల్పడ్డారు.

ఎన్నికలప్పుడే రాజకీయం, ఆ తరువాత విభేదాలు వీడి అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలనేది చంద్రబాబు ఆశయం. దీనిని ఆయన తన రాజకీయ జీవితంలో అక్షరాలా ఆచరించి చూపారు. చంద్రబాబు పాజిటివ్ అయితే వైయస్ రాజశేఖరరెడ్డి నెగటివ్. భిన్న ధ్రువాలు, విభిన్న మనస్తత్వాలు. ప్రత్యర్థిని భౌతికంగా మట్టుపెట్టడం, రాజకీయంగా కోర్టుల కీడ్చటం ద్వారా పైచేయి సాధించాలనేది రాజశేఖరరెడ్డి నమ్మిన సిద్ధాంతం. అయిదేళ్ళు ప్రతిపక్ష నాయకుడిగా ఉంటూ చంద్రబాబుపై తాను స్వయంగా 13 కోర్టు కేసులు

వేశారు. తన అనుచరులు 50 మంది ద్వారా మరో 12 కేసులు దాఖలు చేయించారు. అన్నింటినీ కోర్టులు కొట్టివేశాయి. రాజకీయ కక్ష సాధింపుతోనే న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని తీవ్రవ్యాఖ్యలు చేశాయి. 2004లో అధికారంలోకి వచ్చాక 11 సభాసంఘాలు వేశారు, 4 న్యాయవిచారణ కమీషన్లు నియమించారు, 3 మంత్రివర్గ ఉపసంఘాలు, 4 ఉన్నతాధికారుల కమిటీలు, ఒక సీబీసీఐడీ విచారణ జరిపించారు. చంద్రబాబుపై చేసిన ఆరోపణల్లో ఒక్కటి కూడా రుజువు చేయలేకపోయారు. ఫ్యాక్షన్ నాయకుడికే ఇటువంటి శాడిస్టు ధోరణి ఉంటుంది. అటు కోర్టు కేసులు, ఇటు విచారణ కమిటీలతో 13 ఏళ్ళుగా చంద్రబాబుపై రాజకీయంగా పైచేయి సాధించడానికి చేయని ప్రయత్నం లేదు. కోర్టు కేసులతో వేధించి రాజకీయ కక్ష సాధించాలన్నదే వైయస్సార్ కుటిలనీతి. ఆయన మరణించాక తల్లీ కొడుకులు వైయస్ విజయ, జగన్మోహన్‌రెడ్డి పాత ఆరోపణలనే కట్టకట్టి పాడిందే పాటరా పాచిపళ్ళ దాసుడా అన్నట్లుగా 2464 పేజీల అఫిడవిట్‌ను మళ్ళీ హైకోర్టులో వేశారు.

ఒకే అబద్ధం పదేపదే చెప్పడం ద్వారా నిజమని భ్రమింపజేసి ప్రజలను ఏమార్చడంలో డాక్టరేట్ రాజశేఖరరెడ్డిదే... ఈ పోకడల్లో జగన్మోహన్‌రెడ్డి తండ్రిని మించిపోయాడు. తండ్రి 50 మంది ద్వారా ఒక్కొక్కటి 50 పేజీలతో వేసిన అఫిడవిట్‌లను కట్టగట్టి 2424 పేజీల అఫిడవిట్ తల్లి పేరిట వేయించాడు. సీబీఐ విచారణలో అవినీతి–అక్రమాలు రుజువై కొడుకు జగన్మోహన్ రెడ్డి జైలుకెళ్లే రోజులు వచ్చాయి. దీంతో బైటపడే మార్గం కానరాక చివరికి కన్న తల్లినే అడ్డం పెట్టుకుని దింపుడుకల్లాం ప్రయత్నంగా చంద్రబాబుపై పాత ఆరోపణలన్నీ కుప్పపోశారు. ఇవన్నీ ఇప్పటికే కొన్ని డజన్లసార్లు వివిధ కోర్టుల్లో రిట్‌లు వేసి, అక్షింతలు తిని కొట్టివేసిన కేసులే..అయినా నిస్సిగ్గుగా మరోసారి కోర్టులను ఆశ్రయించి ప్రజల కళ్లకు గంతలు కట్టి తమ అవినీతిపై జరిగే విచారణ నుండి దృష్టి మళ్లించేందుకు విఫలయత్నం చేస్తున్నారు.. దీనిపై సీబీఐ ప్రాథమిక విచారణకు కోర్టు ఆదేశించింది.

## వైయస్ విజయ అఫిడవిట్ - అబద్ధాల కుప్ప

తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబునాయుడుపై వైయస్ విజయ పిటీషన్ హాస్యాస్పదం, దురుద్దేశపూరితం. ఇది విచారణకు అనర్హమైన కేసు. కనీసం నోటీసు ఇచ్చే అవకాశం, అర్హత కూడా లేదని 2004లోనే హైకోర్టు డివిజన్ బెంచ్ చెప్పింది. జగన్ కేసులో నిందితుడైన విజయసాయిరెడ్డి సలహా మేరకు పిటిషన్ వేసినట్లుగా విజయ పేర్కొనడం బట్టి దీని వెనుక పన్నాగం అర్థం అవుతోంది. తమపై ఆరోపణల నుండి బైటపడలేక ఇతరులపై అపవాదులు మోపడం సబబు కాదు.

చంద్రబాబు హయాంలో ఆయన భార్య, కొడుకు పాలనా వ్యవహారాలలో ఏనాడూ జోక్యం చేసుకోలేదనే సంగతి రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు... చంద్రబాబు భార్య పుట్టుకతోనే కోటీశ్వరుడి బిడ్డ. పెళ్ళికి ముందే సంపద పన్ను చెల్లించేది. శ్రీ చంద్రబాబు కుటుంబం వ్యాపారాలు చేసుకోవడం తప్పా..? అటువంటి వ్యక్తిని కూడా సీబీఐ విచారణ పరిధిలోకి తీసుకురావడం బాధాకరం. ఎనిమిదేళ్ళు ప్రతిపక్షంలో ఉన్న నాయకుడిపై అక్రమ ఆస్తుల అభియోగం మోపడం ప్రపంచంలో ఎక్కడైనా ఉందా? గతంలో వేసిన 18 కేసులు, 26 కమిటీల విచారణలో ఏ విధంగా అయితే చంద్రబాబుకు క్లీన్‌చిట్ వచ్చిందో ఈ కేసులో కూడా అదే జరుగుతుంది.

# కాకినాడ పోర్టు వివరాలు

## ఆరోపణ

కాకినాడ పోర్టు ప్రైవేటీకరణను నాటి మలేషియా ప్రధాని మహతీర్ మహమ్మద్ కుమారుడు మిర్జాన్ బిన్ మహతీర్ ఆధ్వర్యంలోని కన్సార్టియానికి అప్పగించారు. నియమ నిబంధనలను మార్చేశారు. ఆ సంస్థ మొదటి రోజు నుంచి లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ మినిమం గ్యారంటీ అమౌంట్‌ను చెల్లించలేదు. ఈ వ్యవహారంలో మారిషస్ కంపెనీలు కీలక పాత్ర పోషించాయి. ప్రస్తుతం కాకినాడ సీపోర్టుకు చైర్మన్‌గా ఉన్న కర్ణాటక వెంకటేశ్వరరావు చంద్రబాబుకు బినామీ.

## వాస్తవం

రాష్ట్రంలో పోర్టుల ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే... చంద్రబాబు కాదు. కాకినాడ పోర్టు అభివృద్ధిలో భాగంగా రూ.293 కోట్ల వ్యయంతో ఏడీబీ బ్యాంకు రుణంతో 1989లో 3 బెర్త్‌లు నిర్మించారు. అప్పటి విజయభాస్కరరెడ్డి ప్రభుత్వం పోర్ట్ ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకుని 09-07-1994న బిడ్లను ఆహ్వానించింది. కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో 4 దరఖాస్తులు వచ్చినా డిటైల్డ్ రిపోర్ట్ ఇవ్వలేదు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక 31-10-1996న మూడు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచారు. 3 బెర్తుల నిర్వహణ, 4వ బెర్త్ నిర్మాణానికి 64 మంది ఆసక్తి చూపినా 16 బిడ్లు మాత్రమే వచ్చాయి.

వీటిలో 3 కంపెనీలను కేంద్ర ప్రభుత్వ సంస్థ 'రైట్స్' ఎంపిక చేసింది. 1) ఇంటర్నేషనల్ సీపోర్ట్స్ లిమిటెడ్ (ఐయస్‌పీయల్). ఇందులో ఎల్ అండ్ టీ, ఎస్‌యస్ (అమెరికా), ప్రెషస్ షిప్పింగ్ (థాయ్‌లాండ్) భాగస్వాములు. 2) కెపిబి (కన్సార్షియం పెర్క ప్లాన్ బెర్‌హాడ్) - మలేషియా మరియు ఎఐడిఇసి కన్సార్షియం. 3) ఏబిడి హెవీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ / కొరియా ఇండస్ట్రీస్ లిమిటెడ్. ఉన్నతాధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్, రైట్స్ సంస్థ ఈయస్‌పీయల్ కంటే కేపీబీకే ప్రాధాన్యత ఇచ్చాయి. అయినా ప్రభుత్వానికి వచ్చే రాబడిని దృష్టిలో పెట్టుకుని ఐయస్‌పీయల్‌నే ఎంపిక చేయడం జరిగింది. మలేషియా ప్రధాని కొడుకు మీర్జాన్ ప్రధాన భాగస్వామిగా ఉన్న కేపీబీ కన్సార్టియంకు

ఇవ్వకుండా టాస్క్‌ఫోర్స్ వేసి ఐయస్‌పీయల్‌కే ఇచ్చారు. వాస్తవంగా ఇవ్వాల్సిన దానిని కూడా కేపీబీకి ఇవ్వకుండా ప్రభుత్వ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఐయస్‌పియల్‌కే కట్టబెట్టారు. ఆ తరువాత రైట్స్ సంస్థ సూచనల మేరకు రెండవ కన్సార్టియం కేపీబీకి 26% తక్కువ కాకుండా పెట్టుబడులకు ప్రభుత్వం అనుమతించింది. ఇందులో 2003 నాటికి ఎల్ అండ్ టీ 26%, కేపీబీ 26%, ఎస్ఈడీసీ 13%, ఇతరులకు 35% వాటాలు ఉన్నాయి. నష్టాలలో ఉన్నామని కోరినా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం మినిమమ్ గ్యారంటీ మొత్తం రద్దు చేయలేదు. ప్రభుత్వానికి నష్టం లేకుండా ఈ మొత్తాన్ని డిఫర్‌మెంట్‌గా అంగీకరించడం జరిగింది. చంద్రబాబు బినామీగా ఆరోపించిన కర్నాటి వెంకటేశ్వరరావు వైయస్ ప్రభుత్వ హయాంలో 2004 సెప్టెంబర్ 21న పోర్ట్ డైరెక్టర్ అయ్యారు. తెలుగుదేశం హయాంలో ఆయనకు పోర్ట్‌తో సంబంధం లేదు. 2008లో ఆయనకు ఎల్ అండ్ టి షేర్లు బదలాయింపునకు వైయస్ ప్రభుత్వమే అనుమతించింది. కాకినాడ పోర్టుపై గతంలోనే వైయస్ రాజశేఖరరెడ్డి రిట్ పిటీషన్ (20125/1999) వేసి ఉపసంహరించుకున్నారు. అప్పుడు వైయస్సార్ ఈయస్‌పియల్ చంద్రబాబుదిగా పేర్కొనగా ప్రస్తుతం ఆయన భార్య కేపీబీ అనడం, కేవీ రావును బినామీగా చెప్పడాన్ని బట్టి ఇవన్నీ అవాస్తవాలే అని స్పష్టం అవుతోంది.

2009లో వైఎస్ మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి శ్రీ కర్నాటి వెంకటేశ్వరరావుకు అనేక రాయితీలు కల్పిస్తూ జీ.ఓ. జారీ చేసారు. ప్రభుత్వ శాఖల అభ్యంతరాలను త్రోసిపుచ్చి లీజు కాలాన్ని 30 నుండి 50 సం॥లకు పొడిగించారు. పోర్టు భూములు బెర్త్‌లపై పూర్తి అధికారాన్ని వారికి కట్టబెట్టారు. మినిమమ్ గ్యారంటీ మొత్తానికి సంబంధించిన షరతును రద్దు చేసారు. దీని వలన ప్రభుత్వానికి రూ.వందల కోట్ల నష్టం వాటిల్లింది.

> **“ రాష్ట్రంలో పోర్టుల ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే... తెలుగుదేశం ప్రభుత్వం కాదు. చంద్రబాబు బినామీగా ఆరోపించిన కర్నాటి వెంకటేశ్వరరావు వైయస్ ప్రభుత్వ హయాంలో 2004 సెప్టెంబర్ 21న పోర్ట్ డైరెక్టర్ అయ్యారు. తెలుగుదేశం హయాంలో ఆయనకు పోర్ట్‌తో సంబంధం లేదు. 2008లో ఆయనకు ఎల్ అండ్ టి షేర్లు బదలాయింపునకు వైయస్ ప్రభుత్వమే అనుమతించింది. ”**

***(అనుబంధం 1,2,3)***

# చిత్తూరు కో-ఆపరేటివ్ డెయిరీ

## ఆరోపణ

**చిత్తూరు ప్రభుత్వ సహకార డైరీని చంద్రబాబు తన హెరిటేజ్ డైరీ కోసం నాశనం చేశారు.**

## వాస్తవం

ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల కారణంగా 1990-2000 మధ్య అనేక సహకార డెయిరీలు మూతపడ్డాయి. ముందు కడప, తరువాత చిత్తూరు, ఉభయ గోదావరి యూనియన్లు దెబ్బతిన్నాయి. విశాఖ, కృష్ణా, గుంటూరు మినహాయించి రాష్ట్రంలో ఎక్కడా కోపరేటివ్ డెయిరీ నిలబడలేకపోయింది. అప్పటి ఆర్థిక మంత్రి శ్రీ మన్‌మోహన్ సింగ్ 1992 లో ఎమ్.అండ్.ఎంపిఓ (మిల్క్ అండ్ మిల్క్ ప్రొడక్ట్స్ ఆర్డర్) జారీచేసి ప్రైవేటు డెయిరీలకు అవకాశం కల్పించి, దేశంలో అనేక కో- ఆపరేటివ్ డైరీలు పతనం కావడానికి కారణమయ్యారు. అప్పటికే ఆపరేషన్ ఫ్లడ్ 3 ద్వారా యూరప్ నుండి వచ్చిన పాలపొడిని ఎన్‌డిడిబీ ఉచితంగా సరఫరా చేయడంతో పాల ధరతగ్గి కోపరేటివ్ డైయిరీల ఉత్పత్తి పోటీపడ లేకపోయింది. పెద్ద నగరాలలో డిమాండ్‌ను పాలపొడి పాలతో సరిపెట్టేవారు. చిత్తూరు డెయిరీపాలను ఆవు పాలనే వంకతో సంవత్సరంలో ఏడునెలలు మాత్రమే రాష్ట్ర డెయిరీ కొనేది. సంవత్సరం కాంట్రాక్టు ఇచ్చేది కాదు, ప్రక్క రాష్ట్రాలకు ఎగుమతి చేసుకోవడానికి రాష్ట్ర యూనియన్ అనుమతి కూడా ఇచ్చేది కాదు. చిత్తూరు డెయిరీ 2.75 లక్షలు లీటర్లు ప్రొక్యూర్ చేస్తే 1.60 లక్షలు మాత్రమే కొనుగోలు చేసేవారు. మిగిలినది మరో మార్గం లేక పౌడర్‌గా మార్చుకోవాల్సి వచ్చేది. మూడు రోజులకు ఒక రోజు ప్రొక్యూర్‌మెంట్ నిలిపివేసేవారు. ఎన్‌డిడిబి ఇచ్చే ఉచిత పౌడర్ వలన ఈ పౌడర్ కు మార్కెట్ లేదు. ఉత్పత్తి ఖరీదు కిలో రూ.34 అయితే గతిలేని స్థితిలో ఇండియన్ ఆర్మీకి ఈ పౌడర్ కిలో రూ.25 కు అమ్మారు. బెంగుళూరు, మద్రాస్ డెయిరీలు పాలలోంచి తీసిన వెన్నను తక్కువ రేటుకు, పాలను వేరేగా అమ్ముకునేవారు. చిత్తూరు డెయిరీకి సిటీ మార్కెట్ లేదు. కిలో నెయ్యి ఉత్పత్తి ఖర్చు రూ.54 అయితే తిరుపతి దేవస్థానానికి కిలో రూ.45 కే టెండర్ ఇచ్చారు. 1989-94 మధ్య కాంగ్రెస్ పాలనలో డెయిరీ అధ్యక్షుడు నిరాహారదీక్ష చేసినా ఈ ధరకే దేవస్థానానికి అమ్మవలసి వచ్చింది. ఈ రెండు కారణాలవలన చిత్తూరు కోపరేటివ్ డెయిరీకి 1989-90 మరియు 1990-91 లోనే కోట్ల రూపాయల నష్టం వచ్చింది. ఈ విషయాన్ని ప్రభుత్వ ఆడిట్ రిపోర్ట్‌లు వెల్లడిస్తున్నాయి. 1993 లో

హెరిటేజ్ పెట్టేనాటికే చిత్తూరు డెయిరీ నష్టాల్లో కూరుకుపోయింది. వైఎస్ నియమించిన సభా సంఘం ఈ విషయాలనే పేర్కొనడం విశేషం.

1992 లో ఎం అండ్ ఎమ్‌పిఓ ద్వారా (డీ లైసెన్సింగ్) శ్రీ మన్‌మోహన్ సింగ్ ప్రైవేటు రంగానికి ప్రవేశం కల్పించిన తరువాత ఒక్క చిత్తూరు జిల్లాలోనే 32 మిల్క్ చిల్లింగ్ సెంటర్లు నెలకొల్పారు. హెరిటేజ్‌తో సహా 5 యూనిట్లు తెలుగుదేశం వారివి - మిగిలిన 25 యూనిట్లు కాంగ్రెస్ నాయకులవి. మాజీ మంత్రి రామచంద్రారెడ్డి 2 యూనిట్లు - అప్పటి కాంగ్రెస్ యం.పి జ్ఞానేందర్‌రెడ్డి 1 యూనిట్ - వెంకటేశ్వర చౌదరి 1 యూనిట్ - నెల్లూరు సునీల్‌రెడ్డి దొడ్ల డైరీ - 3 యూనిట్లు - తిరుమల, క్రీమ్‌లైన్, చిత్తూరు కన్నయ రెడ్డి 3 యూనిట్లు, ఇప్పటి పూతలపట్టు యంపిటిసి సుబ్బారెడ్డి - అందరూ కాంగ్రెస్ వాళ్ళే యూనిట్లు పెట్టారు - ఒక్క హెరిటేజ్ కోసం డెయిరీని నాశనం చేశారంటే అర్థం లేని, మతిలేని ఆరోపణ. ఈ రోజు జిల్లాలో 30 డెయిరీల ద్వారా 10 లక్షల లీటర్లు పాలు ప్రొక్యూర్ అవుతున్నాయి. రైతులకు ఎవరు మేలైన సేవలందిస్తున్నారో వారందరూ పోటీలో నిలబడుతున్నారు - తిరుపతిలో ఎన్‌డిడిబి, మదనపల్లిలో ఎపి డెయిరీ రెండు యూనిట్లు నడుపుతున్నారు - రైతులు ఆనందంగానే ఉన్నారు - వారి గురించి మొసలి కన్నీళ్ళు అవసరం లేదు.

## కాంగ్రెస్ హయాంలోనే చిత్తూరు డెయిరీ క్షీణత

రాష్ట్రంలో 1989 నుంచి కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉంది. 1992 ప్రాంతంలో హెరిటేజ్ డెయిరీ ఆవిర్భవించే నాటికే చిత్తూరు డెయిరీ పీకల్లోతు కష్టాల్లో, తలమునిగే అప్పుల్లో కూరుకుపోయి ఉంది. కనీసం రైతులకు బకాయిలు కూడా చెల్లించే పరిస్థితి లేదు. రైతులకు సకాలంలో సహకార చక్కెర కర్మాగారాలు బకాయిలు చెల్లించలేని తరుణంలో హెరిటేజ్, ఇతర ప్రైవేటు సంస్థలు రైతులకు ప్రత్యామ్నాయ మార్కెట్‌ను కల్పించాయి. 1989-94 మధ్య రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అప్పటికే ఆర్థికంగా నష్టాల్లో ఉన్న చిత్తూరు డెయిరీకి ఆర్థిక సహాయం కల్పించడంలో మార్కెటింగ్ వెసులుబాటు కల్పించడంలో ఘోరంగా విఫలమైనందున చిత్తూరు జిల్లా డెయిరీ సహకార సంఘం మూతబడినట్లు ఆడిట్ నివేదికల ద్వారా స్పష్టమవుతోంది. అయితే కాంగ్రెస్ నాయకులు చాలా కాలంగా ఇందుకు కారణం చంద్రబాబేనంటూ పదేపదే అబద్ధాలు ప్రచారం చేసి తాము చేసిన తప్పును కప్పిపుచ్చుకోవాలని చూస్తున్నారు.

కోపరేటివ్ డెయిరీని తిరిగి పునరిద్ధరిస్తామని 2004 ఎన్నికలకు ముందు వైయస్, కిరణ్‌కుమార్‌రెడ్డి చేసిన వాగ్దానాలు ఏమయ్యాయి? ఎందుకు మాట తప్పారు? వైయస్ సొంత జిల్లా కడపలో ప్రొద్దుటూరు మిల్క్ ప్రొడక్ట్స్ మూతపడినా ఎందుకు పట్టించుకోలేదు? అధికారంలో ఉన్నపుడు సొంత జిల్లా కోపరేటివ్ డెయిరీ అయినా పునరిద్ధరించలేదంటే వారు రైతులపై మాటలలో చూపే ప్రేమ అందరికీ అర్థమవుతుంది. తెదేపా నాయకులే రైతుల కోసం సహకార డెయిరీలను సమర్థంగా నడిపారు - విశాఖ, సంగం, కృష్ణా డెయిరీలు ప్రభుత్వ దాడిని, కుట్రలను తట్టుకుని నడుస్తున్నాయి. ఇది మా పార్టీ ఘనత).

> **“1992 లో ఎం అండ్ ఎమ్‌పిఓ ద్వారా (డీ లైసెన్సింగ్) శ్రీ మన్‌మోహన్ సింగ్ ప్రైవేటు రంగానికి ప్రవేశం కల్పించిన తరువాత ఒక్క చిత్తూరు జిల్లాలోనే 32 మిల్క్ చిల్లింగ్ సెంటర్లు నెలకొల్పారు. హెరిటేజ్‌తో సహా 5 యూనిట్లు తెలుగుదేశం వారివి - మిగిలిన 25 యూనిట్లు కాంగ్రెస్ నాయకులవి.”**

*(అనుబంధం-4)*

# హెరిటేజ్

## ఆరోపణ

**హెరిటేజ్ డైరీకి 1996 నుంచి 2002 మధ్య రూ.15కోట్ల మేర పన్ను రాయితీలిచ్చారు. గత 14 సంవత్సరాల్లో పారిశ్రామిక విధానం క్రింద రూ.100కోట్ల మేర పన్ను సడలింపు లభించింది. వడ్డీల ద్వారా రూ.300కోట్ల మేర లాభం చేకూరింది.**

## వాస్తవం

ప్రతి ప్రభుత్వం పారిశ్రామిక విధానం క్రింద 5 సంవత్సరాలకు ఒకసారి పరిశ్రమలకు కొన్ని ప్రోత్సాహకాలు ఇస్తుంది. కొన్ని వందల కంపెనీలతో పాటు హెరిటేజ్‌కి కూడా ఈ రాయితీలు వర్తించాయి. నేదురుమల్లి జనార్థన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే మిగిలిన పరిశ్రమలతో పాటు హెరిటేజ్‌కు కూడా 'ట్యాక్స్ డిఫర్‌మెంట్' అవకాశం కల్పించారు. మొత్తం రూ.14.48 కోట్లు డిఫర్‌మెంట్ (వాయిదాలలో చెల్లింపు) ఇస్తే అందులో రూ.9.65 కోట్లు మాత్రమే వినియోగించుకున్నారు. ఆ మొత్తానికి కూడా తిరిగి చెల్లింపు ప్రారంభమయింది. 2003-2004 నాటికి పన్ను వాయిదా వేసింది రూ.87 లక్షలు మాత్రమే. దీంతో ఎంత వ్యాపారం చేయవచ్చు? వ్యాపారం కోసం రూ.200 కోట్లు బ్యాంకు ఋణంతో స్థాపించిన సంస్థ హెరిటేజ్. ఇది ఒక పబ్లిక్ లిమిటెడ్ సంస్థ. ఇందులో రూ.100 కోట్లు ఋణం ఇప్పటికే చెల్లించారు.

హెరిటేజ్ సంస్థ స్థాపించి ఇప్పటికి 19 సంవత్సరాలు అయింది. ఈ రోజుకు మొత్తం కంపెనీ విలువ రూ.225 కోట్లు. దీనిలో ప్రమోటర్ల వాటా విలువ రూ.102.83 కోట్లు. లోటస్‌పాండ్‌లో జగన్ అక్రమ సొమ్ముతో కట్టుకున్న ఇంటి పునాదుల ఖరీదు కంటే తక్కువ. హెరిటేజ్ సంస్థ నాలుగు లక్షల మంది రైతులతో ఐదు రాష్ట్రాలలో పని చేస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం నుండి భూములు, కాంట్రాక్టులు, లైసెన్స్‌లు ఎప్పుడూ పొందలేదు. గతంలో కూడా విచిత్రంగా డైరీ పరిశ్రమ వలన వాతావరణ కాలుష్యం జరుగుతోందని చంద్రగిరిలో ఒక కేసు పెట్టారు. భారతదేశంలో ఎక్కడా పాల మీద పన్ను లేకపోతే 2005 ఏప్రిల్‌లో ప్రత్యేకంగా పన్ను విధించి రూ.20 కోట్లు కట్టాలని నోటీసు ఇచ్చారు. హైకోర్టు జోక్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉత్తర్వులను రద్దు చేసింది. చంద్రబాబు హయాంలో హెరిటేజ్ సంస్థకు రూ.300 కోట్ల మేర లబ్ది చేకూరినట్లు వైయస్ విజయ చేసిన ఆరోపణ అవాస్తవం, దురుద్దేశపూరితం.

***(అనుబంధం 5)***

# ఏలేరు కేసు వివరాలు

## ఆరోపణ

**ఏలేరు కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారాన్ని చెల్లించే విషయంలో రాజకీయ నేతలు, ఉన్నతాధికారులు రూ.కోట్లు స్వాహా చేశారు. కేసులో ప్రధాన నిందితుడు పీలా పోతునాయుడు వైశ్యాబ్యాంక్‌లో జాయింట్ అకౌంట్ తెరిచి రూ.2కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అందులో మొదటి బెనిఫిషయరీ పేరును ఖాళీగా ఉంచారు. దీన్ని చంద్రబాబు కోసం ఖాళీగానే వదిలారని అనుకుంటున్నారు.**

## వాస్తవం

ఏలేరు భూసేకరణ... కోర్టులలో కొంతమంది సిబ్బంది లాలూచీపడిన స్కామ్. దీనికి సంబంధించి పత్రికల్లో కథనాలు వచ్చిన వెంటనే అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంది. అఫిడవిట్‌లో వైయస్ విజయ పేర్కొన్నట్లు ఇది రూ.400 కోట్ల కుంభకోణం కాదు. రూ.15 కోట్ల 31 లక్షలు అవకతవకలకు పాల్పడితే అందులో రూ.13 కోట్ల 43 లక్షలు చెల్లింపులు నిలిపివేయడం, రికవరీ చేయడం జరిగింది. దీనికి సంబంధించిన వాస్తవాలు ఈ విధంగా ఉన్నాయి.

1985-95 మధ్య ఏలేరు ఎడమ కాలువ, స్టీల్‌ప్లాంట్, బలహీనవర్గాల గృహనిర్మాణం కొరకు జరిగిన భూసేకరణ కేసుల అప్పీళ్ళలో అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయి. పరిహారం మంజూరైన తరువాత వాటిని పెంచాలని కోరుతూ కొంతమంది చోడవరం, అనకాపల్లి కోర్టులలో రైతుల పేరిట అప్పీళ్ళు వేశారు. నష్టపరిహారంగా అధిక మొత్తం మంజూరు చేయించుకుని సబ్‌జడ్జి, లాయర్ కుమ్మక్కై కక్షిదారులతో కలిసి పంచుకున్నారు. ఈ అంశం తెలుగుదేశం ప్రభుత్వం దృష్టికి రాగానే 1996 డిసెంబర్ 9న సీబీసీఐడీ విచారణకు ఆదేశించింది. డిసెంబర్ 10న ప్రధాన కార్యదర్శి ఎస్.రే తో విచారణ జరిపించింది. 1997 ఫిబ్రవరి 5న న్యాయవిచారణకు ఆదేశించింది. సెక్రటేరియట్ స్థాయిలో జరిగిన నిర్ణయాలపై సీనియర్ ఐఏయస్ అధికారి స్వామినాథన్ ద్వారా పరిశీలించింది. సీబీసీఐడీ విచారణ తరువాత సంబంధిత వ్యక్తులపై ప్రాసిక్యూషన్‌కు కేసులు దాఖలు చేసింది (క్రైమ్ నెం.327/1996) సాంఘిక సంక్షేమం,

గ్రామ భూముల విషయంలో వేర్వేరుగా కేసులు నమోదు చేసింది (క్రైమ్ నెం.6, 7, 10/1997 పీసీ) అప్పటి సబ్‌జడ్జి పి.స్వామిని హైకోర్టు డిస్మిస్ చేసింది, ఏజీపీని తొలగించారు, ఎనిమిది మంది జ్యుడీషియల్ ఆఫీసర్లపై చర్యలు తీసుకున్నారు. ఇద్దరు ఐఏయస్ అధికారులపై క్రమశిక్షణా చర్యలు చేపట్టడం జరిగింది.

దీనిపై 1996, 1997లో దాఖలైన రిట్‌పిటీషన్‌లను విచారించిన హైకోర్టు డివిజన్ బెంచ్ ఎంక్వైరీ కమిషన్ వేయాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్. ఆర్. నాయక్ ఆధ్వర్యంలో విచారణ కమిషన్‌ను నియమించింది. (జీవో నెం.83/5.02.1997) ఆయన రాజీనామా తరువాత జస్టిస్ సోమశేఖర కమిషన్‌ను నియమిస్తూ ఆరు నెలల్లో విచారణ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది (జీవో నెం.468/02.6.1997). అయితే కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టం 3(1) ప్రకారం ఇది చెల్లదంటూ సోమశేఖర తనపై కక్ష సాధిస్తున్నారని అడ్వకేట్ పీలా పోతినాయుడు రిట్ వేశారు (14282/1998). కమిషన్ ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా నిర్ణయం తీసుకోలేదని, సెక్షన్ 3(1) ప్రకారం సోమశేఖర కమిషన్ చెల్లదని హైకోర్టు తీర్పు చెప్పింది. ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన అన్ని చర్యలు తీసుకున్నారంటూ, ఇప్పటికే కమిషన్‌పై రూ.80 లక్షలు ఖర్చు చేసినా దీనివల్ల ఏమీ ప్రయోజనం లేదని పేర్కొంది. సివిల్, క్రిమినల్, క్రమశిక్షణా చర్యలు చాలా ముందంజలో ఉన్న నేపథ్యంలో కమిషన్‌ను రద్దుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది (జీవో 544, 533/4.08.2001). దీనిపై హైకోర్టులో అప్పీల్ వేస్తే కమిషన్ రద్దు చేయడం తప్పుకాదని, కమిషన్‌ను కొనసాగించమని సుప్రీంకోర్టు చెప్పలేదని డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. (21111/2011)

వైయస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక 1999 నుంచి మళ్ళీ సోమశేఖర కమిషన్‌ను పునరుద్ధరిస్తూ ఉత్తర్వులిచ్చారు (జీవో 58/22.06.2004). వేధింపు ధోరణితో విచారణ చేయడంపై శ్రీ అశోక్‌గజపతిరాజు, శ్రీ కడియం శ్రీహరి హైకోర్టులో అప్పీల్ చేశారు (14110 మరియు 18791/2004). దీనిపై హైకోర్టు తీర్పు చెపుతూ సోమశేఖరకు పదవి ఇవ్వలేదని తెలుగుదేశం పార్టీ నాయకులపై కక్ష సాధిస్తున్నారనే ఆరోపణలున్నాయని, ఆయన విచారణ ధోరణి కూడా అలాగే ఉందని, కమిషన్‌ను పునరుద్ధరించడం చట్టవిరుద్ధమని, సోమశేఖర అప్పటికే 10,000ల పేజీల సాక్ష్యాలు సేకరించి కూడా నివేదిక ఇవ్వలేదని కమిషన్‌ను మళ్ళీ రద్దు చేసింది.

> **ఏలేరు కేసులో పార్టీలకు,నాయకులకు ప్రమేయం లేదు. భూసేకరణ సిబ్బంది, సివిల్ కోర్టుల వారు నష్టపరిహారం ఎక్కువగా నిర్ణయించారని, ముడుపులు తీసుకున్నారని ఆరోపణలున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలను అన్ని కోర్టులు సమర్థించాయి.**

***(అనుబంధం 6)***

# భూకేటాయింపులను ఆమోదించిన మంత్రివర్గసంఘం

## ఆరోపణ

**చంద్రబాబునాయుడు సారథ్యంలోని తెలుగుదేశం ప్రభుత్వం చేసిన భూకేటాయింపులపై ప్రతిపక్షంలో ఉండగా వైఎస్ రాజశేఖరరెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలు టీడీపీని నిందిస్తూ విషప్రచారం చేశారు. అధికారంలోకి వస్తే అన్నింటిని రద్దు చేస్తామని ప్రగల్భాలు పలికారు.ప్రస్తుతం మళ్లీ ఇదే అంశంపై వై.ఎస్. విజయ ఆరోపణలు చేస్తున్నారు.**

## వాస్తవం

2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత హైటెక్‌సిటీ, కృష్ణపట్నం పోర్టు, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, గన్నవరం ఎయిర్‌పోర్టు తదితర 64 అంశాలపై అప్పటి ఆర్థిక మంత్రి రోశయ్య ఆధ్వర్యంలో మంత్రివర్గసంఘాన్ని నియమించారు. రోశయ్య, బొత్స సత్యనారాయణ, గీతారెడ్డిలతో కూడిన మంత్రివర్గసంఘం (జీవోయం) పూర్తిస్థాయి విచారణ జరిపింది. 64 అంశాలలో 55 యథాతథంగా ఆమోదించారు. ఒకటి తొలగించారు, నాలుగింటిని మాత్రమే రద్దు చేశారు. అందులో ఐఎంజీ మినహా మిగిలిన మూడూ అత్యల్పమైనవి. తెలుగుదేశం ప్రభుత్వ భూకేటాయింపులను అభినందిస్తూ మంత్రివర్గ సంఘం సమర్థించడం జరిగింది. "రాష్ట్రంలో అధిక పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు దోహదం చేశాయనే అంశాన్ని దృష్టిలో ఉంచుకుని 19 ఐటీ ప్రాజెక్టులను ఆమోదిస్తున్నాం. అధిక ఉద్యోగావకాశాలకు దోహదపడే ఐటీ శాఖలోకి అధిక పెట్టుబడులు రావడమే అందరి ప్రయత్నం అనేది జీవోయం ఏకగ్రీవ అభిప్రాయం" అంటూ మంత్రివర్గ సంఘం తీర్మానం చేసింది.

64 భూకేటాయింపులను మంత్రివర్గ సంఘం కూలంకషంగా సమీక్షించిన అనంతరం వైఎస్ఆర్... వాటిలో 99శాతం అంశాలకు అమోదం తెలపడమే కాకుండా ఆయా సంస్థలకు అదనపు ప్రయోజనాలు సమకూర్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆరోపణలు చేసిన వైఎస్ఆర్ అధికారంలోకి రాగానే సమీక్షల పేరుతో డబ్బులు దండుకుని ఆయా సంస్థలకు అదనపు లబ్ధి చేకూర్చారు. ఈ విధంగా మేళ్లు పొందిన సంస్థలు

అందుకు ప్రతిఫలంగా జగన్‌కు భారీ లబ్ధి చేకూర్చాయి. భూకేటాయింపులలో ఏవిధమైన అక్రమాలు జరగలేదని సమర్థిస్తూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన అనుమతులకు వై.ఎస్.విజయ, జగన్‌లు ఏం సమాధానం చెబుతారు? న్యాయవిచారణలు, సభాసంఘాలు, మంత్రివర్గ ఉపసంఘాలు, ఉన్నతాధికారుల విచారణలు, సీఐడీ విచారణలను జరిపించిన వైఎస్ఆర్... వాటిలో ఒకటి రెండు మినహా అన్నింటికీ ఆమోదముద్ర వేయడం నిజం కాదా? అంటే, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసినవన్నీ అసత్య ఆరోపణలని, మళ్లీ అవే ఆరోపణలతో వై.ఎస్.విజయ, జగన్‌లు దురుద్దేశపూర్వకంగా చంద్రబాబుపై బురద జల్లుతున్నారని స్పష్టమవుతున్నది. ప్రస్తుతం మళ్ళీ ఆ అంశాలన్నింటిపై విచారించాలని విజయ పిటిషన్ వేశారు. కాబట్టి ఆ అంశాలను వైఎస్ఆర్ ప్రభుత్వం ఆమోదించడంపై కూడా దర్యాప్తు సంస్థలు విచారణ జరపాలి. ఈ కేటాయింపులను ఆమోదించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గం, ప్రత్యేకించి మంత్రివర్గ ఉపసంఘంపై కూడా దర్యాప్తు చేయాలి. ఈ అంశాలన్నింటికి వైఎస్ మంత్రివర్గం కూడా పూర్తిస్థాయిలో బాధ్యత వహించాలి.

రాజశేఖర్‌రెడ్డి గతంలో ఎవరిపై అభ్యంతరాలు వ్యక్తం చేశారో వారందరికీ అధికారంలోకి వచ్చాక అదనపు ప్రయోజనాలు చేకూర్చి ఆమోదించడం జరిగింది. శంషాబాద్ విమానాశ్రయం నిర్మాణంపై ఆరోపణలు చేసి తరువాత జీఎంఆర్ కంపెనీకి లబ్ధి చేకూర్చారు. ఇందుకు ప్రతిగా జీఎంఆర్ సంబంధిత కంపెనీలు శతాబ్ది, షైన్‌ఫైనాన్స్‌లు రూ.50 కోట్లు సాక్షిలో పెట్టుబడి పెట్టాయి. ఎమ్మార్‌లో కూడా ఏపీఐఐసీ వాటాలు తగ్గించి ఆ సంస్థకు లబ్ధి చేకూర్చారు. ప్రతిపక్షంలో ఉండగా రహేజాపై తీవ్ర ఆరోపణలు చేసి అధికారంలోకి రాగానే 11శాతం ప్రభుత్వ వాటాను 0.06 శాతానికి తగ్గించిన ఘనత వైఎస్‌దే. అంతేకాకుండా, రహేజాకు మాదాపూర్‌లో 40.25ఎకరాలు, హిమాయత్‌నగర్‌లో 170 ఎకరాలు కట్టబెట్టారు. గంగవరంపోర్టులో అవకతవకలు జరిగాయని ఆరోపించి గద్దెనెక్కగానే 1000 ఎకరాలు అదనంగా కట్టబెట్టారు. ఏ పన్ను చెల్లించకుండా వారికి అటానమస్ ప్రతిపత్తి కల్పించారు. ఆగాఖాన్ ట్రస్ట్‌కు ఎడ్యుకేషన్ సెంటర్ కోసం తెలుగుదేశం ప్రభుత్వం 50 ఎకరాలు కేటాయిస్తే నిందలు వేసి, వారు అధికారం చేపట్టగానే అదనంగా మరో 50 ఎకరాలు కేటాయించారు. తన పిటిషన్‌లో చంద్రబాబు ప్రభుత్వంపై విజయ చేసిన ఆరోపణలు అన్నింటికి వైఎస్ మంత్రివర్గం కూడా పూర్తిస్థాయి బాధ్యత వహించాలి.

**“ రాజశేఖర్‌రెడ్డి గతంలో ఎవరిపై అభ్యంతరాలు వ్యక్తం చేశారో వారందరికీ అధికారంలోకి వచ్చాక అదనపు ప్రయోజనాలు చేకూర్చి ఆమోదించడం జరిగింది. శంషాబాద్ విమానాశ్రయం నిర్మాణంపై ఆరోపణలు చేసి తరువాత జీఎంఆర్ కంపెనీకి లబ్ధి చేకూర్చారు. ఇందుకు ప్రతిగా జీఎంఆర్ సంబంధిత కంపెనీలు శతాబ్ది, షైన్‌ఫైనాన్స్‌లు రూ.50 కోట్లు సాక్షిలో పెట్టుబడి పెట్టాయి. ఎమ్మార్‌లో కూడా ఏపీఐఐసీ వాటాలు తగ్గించి ఆ సంస్థకు లబ్ధి చేకూర్చారు. ”**

# విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు

## ఆరోపణ

**విద్యుత్ ప్రాజెక్టులు నెలకొల్పడానికి గ్లోబల్ టెండర్లు పిలిచి 6 కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. తరువాత ప్రమోటర్ల మార్పిడికి, ఇంధన మార్పిడికి, కాలపరిమితి పొడిగింపునకు అనుమతించారు. జీవీకే, స్పెక్ట్రమ్ గ్యాస్ ఆధారిత కంపెనీల మూలధనం పరిమితి పెంచడంలో ఉదారంగా వ్యవహరించారు. ముడుపులు తీసుకుని అధిక రేట్లకు అనుమతించారు. స్పెక్ట్రమ్ పెట్టుబడులు పరిమితి పెంపుపై సిబిసిఐడి విచారణ జరుపుతోంది.**

**తెలుగుదేశం పార్టీకి చెందిన శ్రీ ఎమ్.వి.వి.యస్.మూర్తికి లాభం కల్పించడానికి కోనసీమ - ఓక్‌వెల్ ప్రాజెక్టు విషయంలో అనేక మినహాయింపులు ఇచ్చారు. ఓక్‌వెల్ నుండి మూర్తి కంపెనీకి బదలాయించడానికి, ఫర్నేస్ ఆయిల్ నుండి గ్యాస్‌కు మారడానికి, ప్రాజెక్టు కాల పరిమితిని పెంచడానికి అనుమతిలిచ్చారు.**

## వాస్తవం

విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై ప్రతిపక్షంలో వున్నప్పుడు వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి సంవత్సరాల తరబడి ఇవే ఆరోపణలు చేసారు. అధికారంలోకి వస్తే వందల కోట్లు ఆదా చేస్తామని ప్రగల్భాలు పలికారు. అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతిపక్షాలు నిలదీస్తే రోశయ్య అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం నియమించారు. (జి.ఓ.నెం.92 తేదీ, జులై20,2004). రోశయ్య సమీక్షలు జరిపి చివరికి షరతులను మార్చడానికి కంపెనీలు ఒప్పుకోవడం లేదని చేతులెత్తేశారు. జివికే, స్పెక్ట్రమ్ ఒప్పందాలను పరిశీలించి వారికి అనుకూలంగా రోశయ్య కమిటీ నివేదిక ఇవ్వడం గమనార్హం.

జీగురుపాడు జీవీకేతో, కాకినాడ స్పెక్ట్రమ్‌తో నేదురుమిల్లి జనార్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో ఎంఓయూలు జరుగగా, కోట్ల విజయభాస్కరరెడ్డి

హయాంలో వీటికి సంబంధించి పిపిఏ ఒప్పందాలు కుదుర్చుకున్నారు. (అప్పుడు ఆర్థిక మరియు విద్యుత్ శాఖ మంత్రి రోశయ్య).

తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ రెండు ప్రాజెక్టు ఒప్పందాలను సమీక్షించి ధరలు తగ్గించడం జరిగింది. స్పెక్ట్రమ్ విషయంలో 15 పైసలు తగ్గించారు. యూనిట్ ధర 144పైసల నుండి 129 పైసలకు తగ్గించడంతో 18 సంవత్సరాలలో రూ.444 కోట్లు కన్సెషన్ వచ్చింది. అదేవిధంగా జీవికె విషయంలో యూనిట్‌కు 136 పైసల నుండి 131 పైసలకు తగ్గించడంతో 18 సం॥లో రూ.144 కోట్లు ఆదా అయ్యింది. 1993లో ఈ రెండు కంపెనీలతో పిపిఏలు కుదుర్చుకున్నప్పుడు విద్యుత్ శాఖ మంత్రి శ్రీ రోశయ్య కాబట్టే వారిని కోర్టులకు పంపించి చేతులు దులుపుకున్నారు. పిపిఏలను కుదుర్చుకున్న మంత్రి, సమీక్షించి ఏమీ చేయలేమని చెప్పిన మంత్రి రోశయ్యను, జీవీకే, స్పెక్ట్రమ్‌లను కూడా ఇందులో ప్రతివాదిగా చూపిస్తే బాగుండేది!

## కోనసీమ - ఓక్‌వెల్ ప్రాజెక్టు

ఇంటర్నేషనల్ బిడ్డింగ్ ద్వారా ఎంపిక అయిన ఆరు కంపెనీలలో ఓక్‌వెల్ ఒకటి. మిగిలిన కంపెనీలకు కేంద్రం నాఫ్తా కేటాయిస్తే వీరికి మాత్రం ఫర్నేస్ ఆయిల్ ఇచ్చింది. కెనడాకు చెందిన ఇంజినీరింగ్ పవర్ సిస్టమ్స్ (ఇపిఎస్) వారితో భాగస్వామిగా చేరింది. యంవివియస్ మూర్తికి చెందిన కంపెనీకి 1999లో 0.9 మిలియన్ల మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ కేటాయింపు కేంద్రం ఇచ్చినందున వారిని భాగస్వామిగా తీసుకున్నారు. ఫర్నేస్ ఆయిల్ నుండి గ్యాస్‌కు మారడానికి ఈ కంపెనీకి అనుమతులు ఇచ్చే సమయానికి యంవివియస్ మూర్తి అందులో భాగస్వామి కాదు. 'బిగ్‌బాస్'కు ముడుపులు అనే ఆరోపణ రాజకీయ దుష్ప్రచారం మాత్రమే. వారు అసెంబ్లీలో చూపిన లేఖ ఫోర్జరీదని నిపుణులు ధృవీకరించారు. (రూ.131 కోట్ల ముడుపుల గురించి కోనసీమ కంపెనీ రామారావు ఓక్‌వెల్‌కు వ్రాసిన లేఖ). దీనిపై సీబిసిఐడి విచారణకు ఆదేశించి ఆరేళ్ళైనా ఏమీ రుజువు చేయలేకపోయారు.

> **"విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై ప్రతిపక్షంలో వున్నప్పుడు వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి సంవత్సరాల తరబడి ఇవే ఆరోపణలు చేసారు. అధికారంలోకి వస్తే వందల కోట్లు ఆదా చేస్తామని ప్రగల్భాలు పలికి చివరికి వారికే అధిక రాయితీలు ఇచ్చారు. కోనసీమ - ఓక్‌వెల్ ప్రాజెక్టులో ఫర్నేస్ ఆయిల్ నుండి గ్యాస్‌కు మారడానికి అనుమతులు ఇచ్చే సమయానికి యంవివియస్ మూర్తి అందులో భాగస్వామి కాదు."**

***(అనుబంధం 7,8,9)***

# ఐయంజీ ప్రాజెక్టు వివరాలు

## ఆరోపణ

**"మూడు రోజులలో ఐయంజీకి భూముల ఒప్పందం ఖరారు చేసారు. జనవరి 2003 నుండి ఎన్నో సమావేశాలు, చర్చలు, కమిటీలు పరిశీలించిన పిదప ఎంఓయూ జరిగింది. "ఐఎంజిబికి ఐఎంజి (వరల్డ్)కు ఏ సంబంధం లేదు. ఈ విషయాలను పరిశీలించకుండా ఒప్పందం చేసుకొని భూములు కట్టబెట్టారు".**

## వాస్తవం

ఆనాడు తెలుగుదేశం ప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చింది. అందులో భాగంగానే కోట్ల రూపాయల వ్యయం చేసి అంతర్జాతీయ స్టేడియంలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం జరిగింది. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు కృషి చేయడం జరిగింది. జాతీయ క్రీడలను, ఆఫ్రో- ఏషియన్ క్రీడలను నిర్వహించి అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌కు ఒక గుర్తింపు తీసుకువచ్చింది. దేశంలోని క్రీడా సౌకర్యాలు, వాటికి కావలసిన మౌలిక వసతులు, శిక్షణ అవసరాలను గుర్తించి 2020 నాటికి భారతదేశం ఒలంపిక్స్ నిర్వహించే స్థాయికి ఎదగడానికి కావలసిన సౌకర్యాలు / శిక్షణ కల్పనకు ఆలోచనలు చేసింది. రాష్ట్రంలో క్రీడా రంగాన్ని అభివృద్ధి చేయడానికి, క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఇప్పించడానికి, ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ క్రీడోత్సవాలను రాష్ట్రానికి రప్పించడానికి, టూరిజంను అభివృద్ధి చేయడానికి ప్రపంచంలోనే స్పోర్ట్స్, ఎంటర్‌టైన్‌మెంట్‌లో ప్రసిద్ధిచెందిన సంస్థ ఐయంజీ ఫ్లోరిడా సంస్థతో ఒప్పందం చేసుకోవడం జరిగింది. ఐయంజీ (ఈస్ట్) దాని అనుబంధ సంస్థ. ఐయంజీ (ఈస్ట్) ఛైర్మన్ ఆండ్రూక్రీగర్ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక ప్రతిపాదన చేస్తూ హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయస్థాయి క్రీడా సౌకర్యాలతో తీర్చిదిద్ది ఒలింపిక్‌స్థాయి శిక్షణలు కల్పిస్తామని ప్రతిపాదన చేశారు. దీనిపై అనేక విడతల చర్చలు, ప్రజెంటేషన్లు, కేబినెట్ సబ్‌కమిటీల పరిశీలన జరిగిన పిమ్మట 9-8-2003న ఎంవోయూ కుదుర్చుకున్నారు.

ఈ ఒప్పందం ప్రకారం... రాష్ట్ర ప్రభుత్వం 855 ఎకరాల భూమి ఇస్తుంది. (400 ఎకరాలు మొదటి విడత, 450 ఎకరాలు రెండవ విడత, 5 ఎకరాలు ఆఫీసు స్థలం). 2004 ఫిబ్రవరిలో 400 ఎకరాలు ఇవ్వడం జరిగింది. ఐయంజీ వారు రూ.700

కోట్లు పెట్టుబడి పెట్టి క్రీడా సౌకర్యాలు, శిక్షణ కల్పించాల్సి ఉంది. ఈ భూమిని కేర్ టేకర్ ప్రభుత్వం ఇచ్చిందనే ప్రచారం అసంబద్ధం. రాజ్యాంగంలో అలాంటిపదం ఎక్కడా లేదు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విషయాలపై ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ చట్టం క్రింద చర్య తీసుకోవాలంటూ పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి ఏసీబీ కోర్టులో కేసు వేశారు. "ఈ కేసులో అవినీతి జరిగిందనే ఆధారాలు లేవు. ఒప్పందం రద్దు మా పరిధిలోకి రాదు" అని చెప్పి ఏసిబి కోర్టు కేసును డిస్మిస్ చేసింది. తరువాత పాల్వాయి గోవర్ధన్ రెడ్డి హైకోర్టులో కేసు వేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. 2004లో హైకోర్టు ఈ పిటీషన్‌ను డిస్మిస్ చేస్తూ తీర్పు చెప్పింది. "ఈ కేసులో అవినీతి, కుట్ర, మోసం అనేవాటికి ఆధారాలు లేవని, తర్వాత వచ్చిన ప్రభుత్వానికి ఈ పాలసీ నిర్ణయంపై అయిష్టత ఉంటే దానిని రద్దు చేసుకోవచ్చునని" హైకోర్టు తీర్పులో పేర్కొంది. ఆ తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం రద్దు చేసి ఆర్డినెన్స్ ద్వారా భూకేటాయింపు రద్దు చేసింది. ఐఎంజి బి ప్రభుత్వంపైన వేసిన కేసు ఇప్పటికీ హైకోర్టులో వుంది.

## ఇది గోబెల్స్ ప్రచారం

దీనిపై వైయస్ విజయ ఆరోపణలు గోబెల్స్ ప్రచారాన్ని మించిపోయాయి. 2006లో అనేక సార్లు ఐఎంజి(వరల్డ్) సంస్థ రాష్ట్ర ప్రభుత్వాన్ని చర్చలకు సమయం ఇవ్వమని లేఖల ద్వారా అభ్యర్థించింది. 'టెడ్ మెక్‌వా', ఐఎంజి తరపున వ్రాసిన లెటర్‌లో ఐఎంజి బి ఒప్పందానికి కట్టుబడి వున్నామని, హైదరాబాద్ క్రీడలకు మంచి కేంద్రంగా చేస్తామని స్పష్టంగా చెప్పారు. మంత్రివర్గ ఉపసంఘం ఎంక్వైరీలో అన్ని ప్రాజెక్టులను ఆమోదించిన వైఎస్ ప్రభుత్వం ఈ ఒక్క ప్రాజెక్టునే రద్దు చేయడానికి కారణాలు వాళ్ళకే తెలియాలి.

అతి తక్కువ ధరలకు (ఎకరం రూ.50,000/-) భూములు కట్టబెట్టారనడం సరికాదు. హైకోర్టు తీర్పులో పేర్కొన్నట్లుగా ఇది వాణిజ్య వ్యవహారం కాదు. ఈ భూమిలో రూ.700 కోట్లు పెట్టుబడితో ఐఎంజి స్టేడియాలు నిర్మించాలి. క్రీడా ఈవెంట్లు ద్వారా వచ్చే ఆదాయం అప్పుడప్పుడు మాత్రమే వస్తుంది. ఐఎస్‌బికి ఎకరం రూ.25,000కు 500 ఎకరాలు ఇచ్చింది కూడా ఆదాయం ఆశించి కాదు. ప్రతిష్ట కోసం నగరం ఇమేజ్ కోసం ప్రయత్నించాం. ఒక జట్టు గెలిస్తే కోట్లలో బహుమతులు ఇస్తాం - క్రీడాకారులకు ఖరీదైన స్థలాలిస్తాం - మెడల్ వస్తే దేశం పొంగి పోతుంది - వీటికి డబ్బుతో విలువ కట్టలేము. కాంగ్రెస్ నేతల వాదన రోడ్లు, బ్రిడ్జిలు.. వాటికి వర్తిస్తుంది, కానీ చదువు, ఆటలకు వర్తించదు. ఇవి అనుభవం వున్న సంస్థలు మాత్రమే చేయగలవు. అన్నీ అనుకూలిస్తే ఈ ప్రాజెక్టు ఇప్పటికే పూర్తి అయిఉండేది. హైదరాబాద్‌కు అంతర్జాతీయంగా క్రీడలలో గుర్తింపు వచ్చి ఉండేది. ఐఎస్‌బి, ఐ.టి., లాగా నగర ప్రతిష్ట పెరిగేది. దీనికి కాంగ్రెస్ నేతలు మోకాలడ్డు పెట్టారు.

పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి చేసిన ఆరోపణలే చేసిన శ్రీమతి విజయ ఆ విషయంలో హైకోర్టు / ఏసిబి కోర్టు తీర్పులను పేర్కొనకపోవడం మోసపూరితం. కోర్టును, ప్రజలను తప్పుదారి పట్టించి రాజకీయ కక్ష తీర్చుకోవడానికి విజయ కేసు వేసిందని చెప్పడానికి ఇదిమరొక ఉదాహరణ.

> **"ఐయంజీకి భూముల కేటాయింపులో అవినీతి జరిగిందనే ఆధారాలు లేవు. ఒప్పందం రద్దు మా పరిధిలోకి రాదు" అని చెప్పి ఏసిబి కోర్టు కేసును డిస్మిస్ చేసింది.**
>
> **"ఇందులో అవినీతి, కుట్ర, మోసం అనేవాటికి ఆధారాలు లేవని, తర్వాత వచ్చిన ప్రభుత్వానికి ఈ పాలసీ నిర్ణయంపై అయిష్టత ఉంటే రద్దు చేసుకోవచ్చునని" హైకోర్టు తీర్పులో పేర్కొంది.**

***(అనుబంధం 10,11)***

# కృష్ణా - గోదావరి బేసిన్

## ఆరోపణ

కృష్ణా-గోదావరి గ్యాస్ బేసిన్ వ్యవహారంలో ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు సరిగా వ్యవహరించకుండా రిలయన్స్ కంపెనీకి మేలు జరిగే విధంగా వ్యవహరించి తద్వారా తన ఆప్తుడిగా ఉన్న శ్రీ రామోజీరావుకు చెందిన కంపెనీలలో పెట్టుబడులు పెట్టే రీతిలో వ్యవహరించారు. అధికారులు ఇచ్చిన సూచనలు కూడా పట్టించుకోకుండా రిలయన్స్‌కు మేలు చేశారు. కేజీ బేసిన్ తవ్వకాల్లో ప్రభుత్వం తరఫున పోటీపడాల్సి ఉండగా, ప్రైవేటు వ్యక్తులైన రిలయన్స్ వారికి మేలు చేయడం జరిగింది. అందుకు ప్రతిఫలంగా రిలయన్స్ కంపెనీవారు 2007లో ఆర్థిక ఇబ్బందులకు లోనైన మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు రిలయన్స్ కంపెనీ అధినేత ముఖేష్ అంబానీ, మిత్రులు, సన్నిహితుల ద్వారా రూ.2,604 కోట్ల పెట్టుబడులు పెట్టించారు.

## వాస్తవం

భారత ప్రభుత్వం 1997లో పెట్రోలియం, గ్యాస్ నిల్వలు వెలికి తీయడానికి న్యూ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ లైసెన్సింగ్ పాలసీ (ఎన్ఇఎల్‌పి) విధానం రూపొందించింది. రెండు ప్రభుత్వాలు (గుజ్రాల్, వాజ్‌పేయి) రెండు సంవత్సరాలు ఎంతో ఆలోచించి ప్రవేశపెట్టిన ఈ విధానం 1999 ఫిబ్రవరి నుండి అమలులోకి వచ్చింది. 1997 కు ముందు పెట్రోలు, గ్యాస్ నిక్షేపాలు వెలికితీత ప్రభుత్వ రంగ సంస్థలైన ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓయన్‌జిసి) మరియు ఓషన్ (ఓఇఎల్) లకు మాత్రమే ఉండేది. మూలధనం, టెక్నాలజీల కొరత వలన దేశీయ ఉత్పత్తి పెరగడంలేదని విదేశీ సంస్థలు / ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా ఈ ప్రయత్నం పెద్ద ఎత్తున చేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధానం ప్రకారం ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు సంస్థలు సమానంగా పోటీపడే అవకాశం కల్పించారు. ప్రభుత్వ సంస్థలకు నామినేషన్ పద్ధతిపై ఇవ్వడం రద్దు చేయబడింది. లాభాలలో వాటాలు, ట్యాక్స్ మినహాయింపులు అనేక రాయితీలు ఇచ్చి ప్రైవేటు పెట్టుబడులు ఆహ్వానించడానికి ఈ విధానం ఉద్దేశించబడినది.

కేంద్ర ప్రభుత్వ కార్యదర్శుల కమిటీ (ఫైనాన్స్, లా మరియు పెట్రోలియం) బిడ్స్ ఆహ్వానించి, వాటిని పరిశీలించి కాబినెట్ కమిటీ ఆన్ ఎకనమిక్ ఎఫైర్స్‌కు సిఫారసు చేస్తారు. కేంద్ర కేబినెట్ ఆమోదంతో తుది నిర్ణయం తీసుకోబడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం పాత్ర ఈ విధానంలో ఏమీ ఉండదు. ఆఫ్‌షోర్ బ్లాకులకు అసలు సంప్రదింపులు చేయవలసిన అవసరం కూడా లేదు. ఆన్‌లాండ్ వాటికి మాత్రమే రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేస్తారు.

**బిడ్డింగ్‌లో ఆంధ్రప్రదేశ్ పాల్గొనకపోవడానికి కారణాలు**

కేంద్ర ప్రభుత్వమే పెట్టుబడులు పెట్టలేక, సాంకేతిక పరిజ్ఞానం సరిపోక విదేశీ / ప్రైవేటు పెట్టుబడుల కోసం పాలసీ రూపొందించిన నేపథ్యంలో అప్పటి రాష్ట్ర పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని వేలంలో పాల్గొనలేదు. ఒక బ్లాకుకు రూ. 30వేల కోట్ల నుండి రూ. 50వేల కోట్ల పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానం, రిస్క్ తీసుకోగలిగిన సామర్థ్యం ఉండాలి. రూ. 15 వేల కోట్ల రాష్ట్ర బడ్జెట్ ఉన్నప్పుడు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఏ విధంగా ఈ రిస్క్ తీసుకొంటుంది? ఒక్క గుజరాత్ రాష్ట్రానికే అప్పటికీ, ఇప్పటికీ విజయవంతంగా నడుస్తున్న పెట్రోకెమికల్ కార్పొరేషన్ ఉంది. కేజీ బేసిన్ గ్యాస్ ఎక్స్‌ప్లోరేషన్ దేశంలోని అన్ని ప్రాంతాలలో ఇంటర్నేషనల్ ఓపెన్ బిడ్డింగ్ ద్వారా జరుగుతాయి. గుజరాత్ తప్ప ఏ ఇతర రాష్ట్రానికి అంత టెక్నికల్ సామర్థ్యం లేదు. వారు కూడా విదేశీ కంపెనీలు, ఓయన్‌జిసి లతో కలిపి కార్యక్రమం చేపడుతున్నారు.

ఓఎన్‌జిసి సంస్థ కూడా కేజి బేసిన్‌లో పోటీ పడినప్పటికీ రిలయన్స్ సంస్థకు కాంట్రాక్ట్ దక్కింది. అనుభవం, టెక్నాలజీ మరియు వనరులు లేని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వేలంలో పాల్గొన్నా విజయం సాధించలేదన్నది స్పష్టం.

వైయస్ హయాంలో కూడా ఎన్ఇఎల్‌పి ఆరవ, ఏడవ రౌండ్లలో కూడా కేజీ బేసిన్ లో బిడ్డింగ్ జరిగినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎనిమిదవ రౌండ్‌లో బ్లాక్ మెయిలింగ్ కోసమే 10 శాతం నామమాత్ర వాటాతో గ్యాస్ కార్పొరేషన్ పేరుతో నాటకమాడారు.

## ఎపి గ్యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్

చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేజీ బేసిన్ ఎక్స్‌ప్లోరేషన్ వేలంలో పాల్గొనలేదని గొడవ పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం వైయస్ హయాంలో చేసిన ఘనకార్యమేమిటి? వైయస్ ప్రోద్బలంతో 2 సెప్టెంబరు 2009 న ఏపి గ్యాస్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ స్థాపించి ఎక్స్‌ప్లోరేషన్ రంగంలోకి అడుగు పెడుతున్నామని ప్రభుత్వం ఆర్భాటం చేసింది. ఈ సంస్థ బిడ్డింగ్‌లో పాల్గొని నాలుగు బ్లాకులను పొందిందని ప్రచారం చేశారు. (ఎన్ఇఎల్‌పి). దీని వెనుక వాస్తవాలు ఏమిటంటే పారిశ్రామికవేత్తలను బ్లాక్‌మెయిల్ చేసి ముడుపులు దండుకునే పన్నాగమే... హైకమాండ్ జోక్యం కారణంగా విఫలం కావడంతో ఈ పన్నాగం పన్నారు. ఒక్కసారి ఈ కన్సార్టియం చూస్తే విషయం అర్ధమవుతుంది.

| | ONGC | BG | OIL | NTPC | APGIC |
|---|---|---|---|---|---|
| **Deepwater Block** | 40% | 35% | 15% | - | 10% |
| **Shallow-Water Block** | | | | | |
| **KG-OSN-2009/1** | 80% | - | - | 10% | 10% |
| **KG-OSN-2009/2** | 90% | - | - | - | 10% |
| **KG-OSN-2009/4** | 50% | - | 30% | 10% | 10% |

1999 లో ఎన్ఇఎల్‌పి(1) నుండి ప్రస్తుతం ఎన్ఎల్ఇపి(8) వరకు ఇప్పటికి ఎనిమిది సార్లు వేలం జరిగితే అప్పటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో ఉండి వేలంలో పాల్గొనకుండా రిలయన్స్‌కు మేలు చేసిందని చెప్పడం ఎంత హాస్యాస్పదమో పై నిజాలు తెలియజేస్తాయి. ఎన్ఇఎల్‌పి గ్లోబల్ బిడ్డింగ్‌లో 10 ఫారిన్ సంస్థలు, 6 ఇండియన్ కంపెనీలు, 5 పబ్లిక్ సెక్టార్ కంపెనీలు పాల్గొని బిడ్డింగ్ చేసినప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేలంలో పాల్గొన్నా, లేకపోయినా దాని మీద ప్రభావం ఏమాత్రం ఉండదు.

**(*అనుబంధం 12*)**

# నిజాం షుగర్ ఫ్యాక్టరీ

## ఆరోపణ

చంద్రబాబునాయుడు గారి ప్రభుత్వ విధానాలతో పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్ (పి.యస్.యు.యస్) లకు పెద్ద ఎత్తున నష్టం జరిగింది. జిల్లా కలెక్టర్లు, పై అధికారుల సూచనలు పరిగణలోనికి తీసుకోకుండా రూ.634 కోట్ల విలువచేసే ఆస్థులను కేవలం రూ.209 కోట్లకు కట్టబెట్టారు. ఇందులో ఎక్కువ మంది లబ్ధిదారులు సొంతపార్టీ వారే... పాలేరు షుగర్స్ మరియు నిజాం షుగర్స్ ఫ్యాక్టరీల విలువ అత్యంత తక్కువగా చూపించి లబ్ధిచేకూర్చారు. ఏమాత్రం అనుభవంలేని నెల క్రితం రిజిష్టరైన తెలుగుదేశం నేత నామా నాగేశ్వరరావుకు చెందిన మధుకాన్ కంపెనీకి చంద్రబాబు గారి ప్రోద్భలంతో పాలేరు షుగర్స్ కేటాయించారు.

## వాస్తవం

పైన పేర్కొనబడిన ఆరోపణలన్నీ అవాస్తవాలు. తప్పుల తడక. 1991లోనే అప్పటి ఆర్థికశాఖా మంత్రిగా ఉన్న మన్మోహన్‌సింగ్ భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలుపెట్టబడిన విషయం వైయస్ శ్రీమతి విజయకు తెలిసినట్లుగా లేదు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే కొన్ని ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వరంగ సంస్థలు నష్టాలబారినపడి, వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిస్థితులలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి అవసరమైతే కొన్ని సంస్థలను పునర్వ్యవస్థీకరించాలని, మరికొన్నింటిని ప్రైవేట్‌పరం చేయాలని, కొన్ని సంస్థలలో ప్రభుత్వ పెట్టుబడులను ఉపసంహరించాలని తీర్మానించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలకు అనుగుణంగానే కొన్ని ప్రభుత్వరంగ సంస్థలలో ఆర్థిక సంస్కరణలను చేపట్టాలని తీర్మానించడమైనది. దానికనుగుణంగా రాష్ట్రంలో మొత్తం 87 పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్‌ను గుర్తించి సంస్కరణలను చేపట్టడం జరిగింది. అందులో 54 సంస్థలలో సంస్కరణలను అమలు చేశారు. వాటిలో 22 మూసివేయగా, మెరుగైన ఫలితాల కోసం 12 సంస్థలు పునర్వ్యవస్థీకరించారు. 11 సంస్థలను పారదర్శకతతో బహిరంగ వేలం ద్వారా ప్రైవేట్ సంస్థలకు స్వాధీనపరిచారు. 9 సంస్థలలో ప్రభుత్వ పెట్టుబడులు ఉపసంహరించడం జరిగింది.

రాష్ట్రంలో ఆర్థిక సంస్కరణలను ఎంతో పారదర్శకతతో అమలుపరిచి, ఆర్థిక పరిపుష్టిని పెంచి, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దోహదపడితే, వైయస్ విజయ ఈ ప్రక్రియను తప్పుపట్టడం, అందునా పాలేరు షుగర్స్ మరియు నిజాం షుగర్స్ ఫ్యాక్టరీల ప్రైవేటీకరణపై వ్యాఖ్యలు చేయడం సబబు కాదు.

రాష్ట్రంలో తీవ్ర నష్టాలలో ఉన్న సంస్థలను ప్రైవేటీకరించడం, మూసివేయడం లేదా సరిదిద్దడం ద్వారా ప్రభుత్వంపై పడుతున్న భారాన్ని తగ్గించి ఆ ధనాన్ని పేదల శ్రేయస్సుకు ఉపయోగించాలనే ధ్యేయంతో 1998తో అప్పటి తెదేపా ప్రభుత్వం సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. దానిలో భాగంగా ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం కోసం 'ఇంప్లిమెంటేషన్ సెక్రటేరియట్' నియమించి పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ బోర్డు ప్రిన్సిపాల్ కార్యదర్శి అధ్యక్షతన ఇది సంస్కరణలు అమలు చేయాలని నిర్దేశించడం జరిగింది. ఇందులో భాగంగానే తీవ్ర నష్టాలతో ఉన్న 7 సహకార రంగ చక్కెర కర్మాగారాల ప్రైవేటీకరణకు నిర్ణయించారు. 2002 జూన్ 20 న ఈ ఏడు షుగర్ ఫ్యాక్టరీలను ప్రైవేట్‌పరం చేయాలన్న ఉద్దేశంతో బహిరంగ వేలం కోసం ప్రధాన వార్తా పత్రికలలో ప్రకటనలు ఇచ్చి ప్రైవేటు వ్యక్తులను ఆహ్వానించడమైనది.

ఖమ్మం జిల్లాలోని పాలేరు సహకార చక్కెర కర్మాగారంలో మార్చి 2001 నాటికి మూలధనం విలువ రూ. 5.13 కోట్లు అంటే పేరుకున్న నష్టాలు రూ.23.80 కోట్లు ఉన్నాయి. దీనిని ప్రైవేటీకరించడానికి జాతీయ, రాష్ట్ర పత్రికలలో ప్రకటనల ద్వారా టెండర్లు ఆహ్వానించి ఎక్కువ టెండరు వేసిన (రూ.9.58 కోట్లు) శ్రీ మధుకాన్ సంస్థకు అమ్మడం జరిగింది. దీనిపై హైకోర్టులో వేసిన దావాలకు (రిట్ పిటిషన్ 5554, 16196, 17493 / 2005) కోర్టు కొట్టివేసింది. 2005లో కోర్టులో కౌంటర్ వేస్తూ అప్పటి ప్రభుత్వంకూడా ఈ వ్యవహారం నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా జరిగిందని పేర్కొనడం జరిగింది. ఏప్రియల్ 2002లో ఈ వేలం జరిగే నాటికి శ్రీ నామా నాగేశ్వరరావు తెదేపా సభ్యులు కాదు. బహిరంగ వేలం ద్వారా అమ్మకం జరిగి కోర్టులు కూడా కొట్టివేసిన ఈ వ్యవహారంపై నిందలు వేసి పది సంవత్సరాల తరువాత కోర్టుకు వెళ్ళడం, తెలుగుదేశం పార్టీ నాయకులను వేధించడానికి చేసిన ప్రయత్నం. నిజాం షుగర్స్ అమ్మకం గురించి వేసిన కేసులో ప్రభుత్వం అత్యుత్తమ విధానాలు పాటించిందని, అత్యుత్తమ ధర పొందిందని అభిప్రాయపడి హైకోర్టు కేసు కొట్టివేసింది. ఆ తర్వాత సభాసంఘం నిజాం షుగర్స్‌ను ప్రభుత్వం వెనుకకు తీసుకోవాలని సిఫారసు చేసినా వైఎస్ ఎందుకు చర్యలు తీసుకోలేదు? ఫ్యాక్టరీని కొన్నవారు కాంగ్రెస్ నాయకులకు బంధువులని చర్యలు తీసుకోలేదా?

> **మధుకాన్ కంపెనీకి చెందిన నామా నాగేశ్వరరావు పాలేరు షుగర్ బహిరంగ వేలంలో పాల్గొన్న రోజున తెలుగుదేశం పార్టీ నాయకుడు కాదు, పార్టీలో లేరు. రాష్ట్ర ప్రభుత్వం ది.17-12-2003న మధుకాన్ కంపెనీకి ఈ ఫ్యాక్టరీని కేటాయిస్తూ ఆదేశాలిచ్చినా 24-05-2004న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే సేల్ డీడ్ రిజిష్టర్ చేయటం జరిగింది. తప్పుగా కేటాయించినట్లు భావిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం సేల్‌డీడ్ ఎందుకు రిజిష్టర్ చేసింది?**

# శంషాబాద్ ఎయిర్‌పోర్ట్

## ఆరోపణ

**1997-2001 మధ్య శంషాబాద్ పక్కనే ఉన్న పాలమాకుల గ్రామంలో రామోజీరావు తన ఉద్యోగుల ద్వారా 360 ఎకరాలు కొనుగోలు చేశారు. 1998లో శంషాబాద్ విమానాశ్రయం పెడతామని చంద్రబాబు ప్రకటించారు. అంతర్జాతీయ విమానాశ్రయం కోసం శంషాబాద్, ఇబ్రహీంపట్నంలను ఎంపిక చేశారు. దీనికి సంబంధించిన జీవో 2003లో వచ్చింది. దీనివల్ల రామోజీరావు భూమి విలువ 4 రెట్లు పెరిగింది.**

## వాస్తవం

శంషాబాద్ విమానాశ్రయం ప్రపంచ పటంలో సముచితమైన స్థానం ఏర్పరచుకుందంటే అందుకు కారణం తెలుగుదేశం పార్టీయే. రాష్ట్రానికి అంతర్జాతీయ విమానాశ్రయాలను తీసుకురావాలనే ఆలోచన చేసింది శ్రీ ఎన్టీ రామారావు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే హైదరాబాద్, విశాఖపట్టణాలలో విమానాశ్రయాలు తీసుకురావాలనే ఉద్దేశ్యంతో స్థలాల ఎంపిక కోసం 1995 ఏప్రిల్ 21న రెవెన్యూ సెక్రటరీ అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేశారు. శ్రీ నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన తరువాత శరవేగంగా అంతర్జాతీయ విమాశ్రయాన్ని తీసుకురావాలనే ఆలోచనలో హైదరాబాద్‌లో అప్పటికే హకీంపేటలో ఉన్న రక్షణ శాఖ విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా మార్చాలని కోరుతూ కేంద్ర మంత్రి ములాయంసింగ్‌కు లేఖలు రాశారు. భద్రతా కారణాల రీత్యా హకీంపేట విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా మార్చడానికి అనుమతి ఇవ్వలేమని కేంద్రం పేర్కొనడంతో సివిల్ ఏవియేషన్ డైరెక్టర్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్, రైట్స్ కన్సల్టెంట్, ఆర్టీఓలు సభ్యులుగా సైట్ సెలక్షన్ కమిటీని ఏర్పాటు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు నాదర్‌గుల్, బొంగులూరు, శంషాబాద్, పెద్దషాపూర్, నార్కోడా స్థలాలను ఎంపిక చేశారు. ఇందులో నాదర్‌గుల్, నార్కోడా వద్ద భూమి లభ్యత లేకపోవడంతో స్థల నిర్ణాయక కమిటీ 3 స్థలాలను మాత్రమే కేంద్రానికి పంపింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ఏరియల్ సర్వే నిర్వహించి రైల్వే స్టేషన్, జాతీయ రహదారి ఇతరత్రా సదుపాయాలు ఉండటం వల్ల శంషాబాద్‌ను అనువైన స్థలంగా నిర్ణయించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర ఏమీ లేదు. 1998 డిసెంబర్ 21న అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు శంషాబాద్‌ను ఫైనల్ చేస్తూ జిఓ నెం.204ను విడుదల చేయడమైనది. ఈ జిఓ విడుదలైన 3 సంవత్సరాల తరువాత రామోజీరావు శంషాబాద్ పరిసర ప్రాంతాలలో భూములు కొనుగోలు చేయడం జరిగింది. ప్రభుత్వం ప్రకటించిన మూడేళ్ళ తరువాత రామోజీరావు భూములు కొనుగోలు చేస్తే దానికి అప్పటి ప్రభుత్వానికి ముడిపెట్టే ప్రయత్నం చేయడం దారుణం.

శంషాబాద్‌లో శ్రీ రామోజీరావుకు 360 ఎకరాల భూమి ఉందని.. ఆ భూమి విలువ పెంచడానికే అక్కడ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు చేయడం అర్థరహితం.. అవివేకం. శ్రీ రామోజీరావుకు లబ్ది చేకూర్చాలని తెలుగుదేశం భావిస్తే నాదర్‌గుల్ ప్రాంతంలోని రామోజీ ఫిలింసిటీ సమీపంలో విమానాశ్రయం నిర్మించే వారుగా? విమానాశ్రయాల ఏర్పాటు అనేది కేంద్రం పరిధిలో ఉంటుందన్న విషయం కూడా తెలియకుండా విమర్శలు చేస్తున్నారు. పౌర విమాన మంత్రిత్వ శాఖ విధించిన నిబంధనల ప్రకారమే శంషాబాద్ విమానాశ్రయాలకు 5 వేల ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. వైఎస్ అధికారంలోకి రాగానే శంషాబాద్ విమానాశ్రయంపై రోశయ్య అధ్యక్షతన కమిటీ కమిటీ అన్నీ విచారించి మొత్తం పారదర్శకంగా ఉందని ఈ రకమైన అక్రమాలు జరగలేదని క్లీన్‌చిట్ ఇచ్చింది. 2006లో సీబీఐ విచారణకు వైఎస్ ప్రభుత్వం ఆదేశిస్తే... విమానాశ్రయ స్థల ఎంపిక పారదర్శకంగా, నిబంధనల ప్రకారం జరిగిందని తేల్చింది.

> **“రాష్ట్రంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు నాదర్‌గుల్, బొంగులూరు, శంషాబాద్, పెద్దషాపూర్, నార్కోడా స్థలాలను ఎంపిక చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ఏరియల్ సర్వే నిర్వహించి రైల్వే స్టేషన్, జాతీయ రహదారి ఇతరత్రా సదుపాయాలు ఉండటం వల్ల శంషాబాద్‌ను అనువైన స్థలంగా నిర్ణయించారు. విమానాశ్రయాల ఏర్పాటు అనేది కేంద్రం పరిధిలో ఉంటుందన్న విషయం కూడా తెలియకుండా విమర్శలు చేయడం శోచనీయం. రామోజీరావు భూమి విలువ పెంచడానికే శంషాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు చేయడం అర్థరహితం.”**

***(అనుబంధం 13,14)***

# హైటెక్ సిటీ

## ఆరోపణ

**హైటెక్ సిటీ నిర్మాణం గురించి అధికారికంగా ప్రకటించక ముందే నాటి సీయం చంద్రబాబు బినామీగా ఆయన సన్నిహిత మిత్రుడు, సినీ నటుడు మాగంటి మురళీమోహన్ అక్కడ భూముల కొనుగోళ్ళు మొదలుపెట్టారు. మురళీమోహన్ భూములు కొన్న కొద్ది కాలానికే హైటెక్ సిటీ ప్రాజెక్టును చంద్రబాబు ప్రకటించారు. దీంతో భూముల ధరలు నాటకీయంగా పెరిగిపోయాయి.**

## వాస్తవం

మాదాపూర్‌లోని సర్వే నెం.64లో ఉన్న ప్రభుత్వ భూమిలో శ్రీ ఎన్. జనార్ధన్ రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎలక్ట్రానిక్ సిటీని స్థాపించాలని భూమి పూజ చేశారు. 1994 ఎన్నికలలో టీ.డీ.పీ అధికారంలోకి వచ్చిన తరువాత దూరదృష్టితో అప్పటికి ఐ.టి రంగంలో దూసుకుపోతున్న బెంగుళూరు, చెన్నైలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వపరంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరియు ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చాలనే సంకల్పంతో ప్రపంచంలో ఉన్నటువంటి ఐ.టి సంస్థలను హైదరాబాద్‌కు తీసుకువచ్చే ప్రయత్నం చేపట్టారు. దీనిలో భాగంగా మెరుగైన వసతులకు అనువైన ప్రదేశంగా మాదాపూర్ సర్వే నెం.64 లో ఉన్నటువంటి 150 ఎకరాల స్థలాన్ని మొదటి దశ కింద కేటాయించి ఎ.పి.ఐ.ఐ.సిని స్ట్రాటిజికల్ పార్టనర్‌గా నియమిస్తూ ఓపెన్ బిడ్డింగ్ ద్వారా పారదర్శకంగా ఆసక్తి గల సంస్థలను ఆహ్వానించడం జరిగింది. ఆ రోజున అనేక కంపెనీలు ముందుకు వచ్చాయి. అందులో ఏపీఐఐసీకి 11 శాతం వాటాతో ఎల్అండ్‌టీకి ఇవ్వడం జరిగింది. ఈ ప్రాజెక్టు ఎల్అండ్‌టీకి అవార్డు చేసే ముందు అఖిలపక్ష సమావేశం, శాసనసభాపక్ష నేతలతో చర్చించి నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఆరోజు జరుగుతున్న అభివృద్ధి చూసి, అందరూ ప్రభుత్వాన్ని చంద్రబాబు నాయుడు గారిని అభినందించిన విషయం విదితమే.

21-01-1996న ఈ ప్రాజెక్టుకు సంబంధించి 150 ఎకరాల స్థలాన్ని (ఆనాటి జిల్లా కలెక్టర్ ద్వారా) ఏపీఐఐసీకి కేటాయించడం జరిగింది. ఎ.పి.ఐ.ఐ.సితో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారంగా ఎల్అండ్‌టి అనుకున్నట్లుగా మొదటి దశను పూర్తి చేసింది. దీనిపై శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వేసిన కేసును హైకోర్టు కొట్టివేసింది. హైటెక్ సిటీ ఏర్పడడం మూలంగా మైక్రోసాఫ్ట్, ఒరాకిల్, డెల్, మోటరోలా, డెలాయిట్, S.B.C, G.E లాంటి అనేక సంస్థలు పెట్టుబడులు పెట్టి హైదరాబాద్‌లో వారి సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. తద్వారా 3 లక్షల ఉద్యోగాలు ప్రత్యక్షంగా, 10 లక్షల ఉద్యోగాలు పరోక్షంగా లభించాయి.

అంతేకాకుండా, సంవత్సరానికి రూ. 36 వేల కోట్లు ఎగుమతులు రావడానికి, తద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరడానికి దోహదపడింది. ఈ అభివృద్ధిని చూసి దేశంలో ఉన్నటువంటి అన్ని రాష్ట్రాలు కూడా ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శంగా తీసుకున్నాయి. బిల్‌క్లింటన్, బిల్‌గేట్స్ లాంటి అనేక మంది పారిశ్రామికవేత్తలు హైదరాబాద్‌కు రాగలిగారంటే, పరిశ్రమలు స్థాపించగలిగారంటే దానికి కారణం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు శ్రీ చంద్రబాబు సమర్థతే కారణం. దీనివల్ల కేవలం హైటెక్‌సిటీ పరిసర ప్రాంతాలే కాకుండా రంగారెడ్డి జిల్లా పరిసర ప్రాంతాలలో అనేక పరిశ్రమలు రావడం ద్వారా భూముల విలువలు పెరిగాయి. ఇక్కడ గమనించదగిన విషయమేమిటంటే వైయస్ విజయ అఫిడవిట్‌లో పేజి నెం. 46లో పేర్కొన్నట్లుగా మాదాపూర్‌లోని సర్వే నెం. 65లో ఐటీ కంపెనీలకు మరియు దివ్యశ్రీ సాఫ్ట్‌వేర్‌కు ఎలాంటి అలాట్‌మెంట్ జరగలేదు. ఇది ప్రయివేటు ల్యాండ్. ఐటీ పాలసీలో భాగంగా ఏపీఐఐసీ ద్వారా సర్వే నెం. 64లో అలాట్‌మెంట్ జరిగింది. ఈ ప్రాథమిక సమాచారం కూడా లేకుండా అఫిడవిట్ దాఖలు చేయడం వెనుక ఎలాంటి దురుద్దేశం ఉందో అర్థం అవుతోంది.

హైటెక్ సిటీ, మాదాపూర్‌లో ఫేస్- 1, ఫేస్-2, ఫేస్-3 క్రింద డెవలప్ చేసిన సుమారు 600 ఎకరాలలో పారిశ్రామికీకరణ కారణంగా ఊహించని రీతిలో చుట్టుప్రక్కల అన్ని భూములకు విలువలు పెరిగాయి. ప్రభుత్వం కూడా రిజిస్ట్రేషన్ విలువను గజం ధర రూ. 400 నుండి సుమారు రూ. 40 వేల వరకు పెంచారు. ఇది నిరంతరం జరుగుతున్న అభివృద్ధికి సంకేతం. ఒక్క హైటెక్ సిటి పరిసరాలే కాదు, అవుటర్ రింగ్‌రోడ్ పరిసరాలు, గచ్చిబౌలి, శ్రీశైలం హైవే, మేడ్చల్ రోడ్, సాగర్ రోడ్, విజయవాడ రోడ్, ఘట్‌కేసర్, షామీర్‌పేట్, పటాన్‌చెరు, శంషాబాద్ ఈ విధంగా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి. హైదరాబాద్ చుట్టు ప్రక్కల 50 కి.మీ విస్తీర్ణంలో 1996 లో ఉన్నటువంటి మార్కెట్ ధర కంటే 10 నుండి 100 శాతం భూముల విలువ పెరిగింది. దీనికి ప్రభుత్వ విధానాలు, ప్రపంచీకరణ ప్రభావాలు కారణం. బెంగుళూరు, ముంబాయి, కలకత్తా, మద్రాసుతో పోల్చుకున్నప్పుడు వాళ్ళ చదరపు అడుగు విలువ మన గజం విలువతో సమానం అనేది గమనించాలి. నిరాధారమైనటువంటి ఆరోపణలతో అభివృద్ధిని అడ్డుకునే విధంగా ఉపాధి అవకాశాలు కుంటుపడేలా పారిశ్రామికవేత్తలను భయభ్రాంతులకు గురి చేసేలా కేవలం రాజకీయం, అధికారమే పరమావధిగా భావించి తాము నిండా అవినీతిలో కూరుకుపోయి ఇతరులపై బురద జల్లాలనుకోవడం దారుణం.

హైటెక్‌సిటి వస్తుందని చంద్రబాబుగారు చెప్పడంతో జయభేరి సంస్థకు సంబందించిన మురళీమోహన్ 2.34 ఎకరాలలో స్థలం కొనుగోలు చేసి, లబ్ధిపొందాడనేది మరో అభియోగం. హైటెక్ సిటీ చుట్టుప్రక్కల ఉన్న మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలిలో వందలాది ఎకరాలు ఎవరి ప్రమేయం వల్ల ఎవరు కొన్నారు..? చేపట్టిన నిర్మాణాలు ఎవరివి ? పూర్తి విచారణ జరిపితే నిజం నిగ్గు తేలుతుంది. అనుమతి లేని గురుకుల్ ట్రస్ట్‌లో వై.ఎస్ వివేకానందరెడ్డి నిర్మించిన భవనానికి ఏమని జవాబు చెబుతారు? మెరిడియన్ స్కూల్ పేరుతో నీలకంఠం అధీనంలో ఉన్న భూముల్లో నిర్మాణాలు ఎవరి హయాంలో జరిగాయి? ఎన్ కన్వెన్షన్స్‌కు అనుమతి ఎవరు ఇచ్చారు? సర్వే నెం. 37, 40, 42, 43, 44, 45లలో ఉన్నటువంటి 73 ఎకరాలు కొన్న పెద్దలు ఎవరు? వీరు కూడా చంద్రబాబు బినామీలేనా? ఇలా చెప్పుకుంటూ పోతే గురుకుల్ ట్రస్ట్ భూములు, కావూరి హిల్స్, అయ్యప్ప సొసైటి, భాగ్యనగర్ సొసైటి, డైమండ్ హిల్స్ సొసైటి, గచ్చిబౌలి స్థలాలు ఎవరి అనుయాయులవో, వారు ఏ పార్టీకి సంబంధించిన వారో వివరాలలోకి వెళ్తే తేటతెల్లం అవుతుంది. వీరందరినీ వదిలిపెట్టి కేవలం 2.34 ఎకరాలు భూమి కొని అన్ని అనుమతులతో నిర్మాణం చేపట్టిన మురళీమోహన్‌ను చంద్రబాబు బినామీగా పేర్కొనడం పూర్తిగా దురుద్దేశపూరితం.

***(అనుబంధం 15)***

# రెడ్డి ల్యాబ్స్

## ఆరోపణ

**రెడ్డీస్ ల్యాబరేటరీస్‌కు 14 సంవత్సరాల క్రితం రూ.25కోట్ల మేర టాక్స్ డిఫర్‌మెంట్ ఇచ్చారు. ఇందుకు ప్రతిఫలంగా చంద్రబాబునాయుడు కుటుంబానికి చెందిన శ్రీరామ అగ్రికల్చర్ ఫామ్స్‌లోని 3 ఎకరాల భూమిని అధికరేటుకు రెడ్డీస్ ల్యాబ్‌వారు కొనుగోలు చేశారు. వారు నిర్మించిన భవనాన్ని గూగుల్‌కు అద్దెకిచ్చి చంద్రబాబు లబ్ధి పొందారు. దివ్యశ్రీ సంస్థకు అక్రమంగా 7 ఎకరాలు కేటాయించారు.**

## వాస్తవం

ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రూపొందించిన ఇండస్ట్రియల్ టార్గెట్-2000 పాలసీ కింద నేదురుమల్లి జనార్ధనరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జారీచేసిన 498 జి.ఓకు కొనసాగింపుగా, 1996లో జి.ఓ.నెం.108 జారీచేయడం జరిగింది. ఈ జి.ఓ ద్వారా రెడ్డీస్ ల్యాబ్‌కు రూ.25 కోట్ల మేర టాక్స్ డిఫర్‌మెంట్ ఇవ్వగా, దానిలో రూ.4.23కోట్లు మాత్రమే వినియోగించుకున్నారు. ఈ మొత్తాన్ని కూడా 2012 నుండి రికవరీ చేసుకొనే విధంగా నిబంధనలు పెట్టటం జరిగింది. ఇందులో రెడ్డీస్ ల్యాబ్‌కు నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి లబ్ధి చేకూర్చలేదు. కానీ, రూ.25కోట్ల మేర లబ్ధి చేకూరినట్లు విజయ తన అఫిడవిట్‌లో అవాస్తవాలు పేర్కొంది.

శ్రీరామ అగ్రికల్చర్ ఫామ్స్ పేరుతో 1989లో శ్రీ చంద్రబాబు కుటుంబ సభ్యులు కొన్న 3 ఎకరాల భూమిని 2000 జూలైలో ఆ రోజు ఉన్న మార్కెట్ విలువ ప్రకారం సతీష్‌రెడ్డి, దీప్తిరెడ్డిలు మార్కెట్ విలువ ప్రకారం కొనుగోలు చేయడం జరిగింది. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారు దివ్యశ్రీ సాఫ్ట్ టెక్ రియల్టర్స్‌తో ఒప్పందం కుదుర్చుకొని ప్రాజెక్టును పూర్తిచేసుకున్నారు. ఇది సాధారణంగా జరిగే క్రయ, విక్రయాలే. దీనిపై ఆరోపణలు చేయటం అర్ధరహితం.

గూగుల్‌కు అద్దెకివ్వడం వల్ల వచ్చే ఆదాయం కేవలం సతీష్‌రెడ్డికి, దివ్యశ్రీకి చెందుతుంది తప్ప వేరే వారికి రాదు. నెలకు రూ.2 కోట్లు అద్దె రూపేణా చంద్రబాబుకు చెందుతుంది అనే వాదన హేతుబద్ధత లేనిది.

2002లో కన్వర్జీస్ అనే సంస్థ ఏపిఐఐసి నుండి 4.50 ఎకరాల భూమిని ఐ.టీ. పాలసీ ప్రకారం ఎకరం రూ.80 లక్షలకు తీసుకుని 1500 ఉద్యోగాల కల్పనకు ఒప్పుకుంది. ఆ సంస్థ తమ భాగస్వామిగా దివ్యశ్రీ హోల్డింగ్స్‌ను చేర్చుకొని అభివృద్ధి చేసింది. ఇవే సంస్థలకు మళ్ళీ 2007లో ఎకరం రూ.80 లక్షల వంతున 2.69 ఎకరాలను కేటాయించారు.

# సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ

## ఆరోపణ

**సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీని మురళీమోహన్‌కు లబ్ధి చేకూర్చేందుకు ఏర్పాటుచేయడం జరిగింది.**

## వాస్తవం

సైబరాబాద్ డెవలప్‌మెంట్ ఏరియా మాస్టర్ ప్లాన్ లోని రూల్ 12(4) ఆఫ్ సెక్షన్ 8(2) ఎ.పి. అర్బన్ ఏరియా డెవలప్‌మెంట్ యాక్ట్ - 1975 అమెండ్‌మెంట్ ప్రకారంగా నోటిఫైడ్ చేయడం జరిగింది. పరిశ్రమలకు అనువైన వసతులు కల్పించడం కోసం, మాదాపూర్, కొండాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కోకాపేట లాంటి ప్రదేశాలలో ఉన్నటువంటి ప్రభుత్వ, వక్ఫ్ భూముల్ని రక్షించాలనే ఉద్దేశ్యంతో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేస్తే మురళీమోహన్‌కు లబ్ధి చేకూర్చేందుకంటూ విజయ అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారు. ఈ సంస్థకు రాయితీలు ఇచ్చే అధికారం కూడా లేదు. ఈ సంస్థ ద్వారా తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో భూములకు భద్రత రక్షణ ఉండేది. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీని రద్దుచేసి ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూములు, వక్ఫ్ భూములు, అన్యాక్రాంతం చేశారు. ఈ సంస్థను రద్దుచేయటం వలన వైఎస్ రాజశేఖరరెడ్డి అనుయాయులకు ఇష్టం వచ్చినట్లుగా భూములు ఆక్రమించుకున్నారు. ఇందుకు ఉదాహరణే గురుకుల్ ట్రస్ట్ భూములు. ఇందులో వైయస్ సోదరుడు వివేకానందరెడ్డి అక్రమంగా ఇంటిని నిర్మించుకున్నారు. వాస్తవాలను ప్రక్కదోవ పట్టించేందుకు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారు.

# ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్ట్

## ఆరోపణ

అత్యంత విలువైన ఆస్తులు కలిగిన ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్ట్‌లో వ్యక్తిగత వాటా లేని చంద్రబాబు, ఆయన భార్య, ఆడిటర్‌లు సభ్యులుగా ఉన్నారు. బంజారాహిల్స్‌లో 4 వేల చదరపు గజాల స్థలాన్ని 30 ఏళ్ల కాలానికి నామమాత్రపు అద్దెతో లీజుకు కేటాయించారు. హైటెక్ సిటీ కాంట్రాక్టు దక్కించుకున్న ఎల్ అండ్ టి సంస్థ ఉచితంగా ట్రస్ట్ భవనాన్ని నిర్మించింది. ఆ సమయంలో ట్రస్ట్ ఆదాయం రూ.8 లక్షలు కాగా, భవన నిర్మాణ వ్యయం రూ.కోట్లలో ఉంది. ట్రస్ట్, పార్టీ కార్యాలయంలు ఒకే ప్రదేశంలో ఉండడంతో ట్రస్ట్ ద్వారా భారీ మొత్తంలో విదేశీ నిధులను లెక్కల్లో చూపకుండా పార్టీకి వినియోగిస్తున్నారు. 2000 సం॥ నుండి ఏటా రూ.2.5 కోట్ల విరాళాలు వస్తున్నాయి. దేశీయంగా వచ్చిన విరాళాల్లో సత్యం గ్రూప్ ఇచ్చిన రూ.కోటి, మధుకాన్ షుగర్స్, హయగ్రీవ ఎస్టేట్స్ ఇచ్చిన రూ.20 లక్షలు ఉన్నాయి. ఒప్పందాన్ని ఉల్లంఘించి ట్రస్ట్ భూమిలో పార్టీ కార్యాలయాన్ని రాజకీయ కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు.

## వాస్తవం

వై. ఎస్.విజయ తన అఫిడవిట్‌లో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్‌పై పేర్కొన్న ఆరోపణలన్నీ దురుద్దేశపూరితం, నిరాధారం, అవాస్తవం, అర్థరహితం. ట్రస్ట్‌కు భూమి కేటాయించడాన్ని సవాల్ చేస్తూ 1997లో కాంగ్రెస్ నాయకుడు రెడ్యానాయక్ దాఖలు చేసిన రిట్ పిటిషన్ నెం.13302ను 1998 సెప్టెంబర్ 12న హైకోర్టు కొట్టివేసింది. ఇదే అంశంపై దాఖలు చేసిన ఎస్.ఎల్.పి.ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. అయితే, ఈ వాస్తవాలను వై.ఎస్.విజయ ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారు. ఇండియన్ ట్రస్ట్ చట్టం కింద నమోదైన ఎన్టీఆర్ ట్రస్ట్ ఖాతాలను క్రమం తప్పకుండా సంబంధిత సంస్థలకు సమర్పించడం జరుగుతున్నది. ట్రస్ట్ కార్యక్రమాలలో భాగంగా పేద విద్యార్థులను చదివించడం, ప్రకృతి విపత్తుల సమయంలో సహాయ కార్యక్రమాలను చేపట్టడం, బ్లడ్ బ్యాంక్ నిర్వహణ మొదలైన

సేవలకు మంచి గుర్తింపు పొందింది. ట్రస్ట్ భవనాన్ని ఎల్అండ్‌టి సంస్థ ఉచితంగా నిర్మించిందనడం అర్థరహితం. ట్రస్ట్‌కు 1997-2004 మధ్య రూ.1.83 కోట్లు విరాళాలు వచ్చాయి. భవన నిర్మాణానికి బ్యాంక్ నుంచి ఋణంగా రూ.1.25 కోట్లను తీసుకున్నది. అయితే, విరాళంగా రూ.8 లక్షలు మాత్రమే వచ్చాయనడం అవాస్తవం. ట్రస్ట్ భవనంలో కొంత భాగాన్ని ప్రస్తుతం మార్కెట్‌లో ఉండే సాధారణ అద్దె కన్నా ఎక్కువ మొత్తానికి టీడీపీకి అద్దెకు ఇచ్చింది. ప్రభుత్వానికి లీజు మొత్తాన్ని క్రమం తప్పకుండా చెల్లిస్తున్నది. ప్రభుత్వం లీజుకు ఇచ్చిన 4 వేల చదరపు గజాలకు అదనంగా 2,240.75 చదరపు గజాలను కొనుగోలు చేసింది.

రాజకీయ కార్యక్రమాలకు విదేశీ నిధులను వినియోగిస్తున్నామని దురుద్దేశపూర్వకంగా ఆధారం లేని ఆరోపణలను చేస్తున్నారు. ట్రస్ట్ స్వీకరించిన విదేశీ నిధులకు ఎఫ్.సి.ఆర్.ఏ. అనుమతి ఉంది. ట్రస్ట్ నిధులను పార్టీకిగానీ, మరే ఇతర వ్యక్తులకుగానీ ఇవ్వలేదు. విరాళాల స్వీకరణ, వినియోగానికి సంబందించిన వివరాలతో ఏటా కేంద్ర హోంశాఖకు రిటర్న్సు సమర్పించడం జరుగుతున్నది. 2009-10లో వరదలు, తుఫాన్ బాధితుల సహాయ కార్యక్రమాల కోసం మధుకాన్ సంస్థ రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చింది. ఆ సమయంలో శ్రీ చంద్రబాబు అధికారంలో లేకపోవడం గమనార్హం.

2జి కుంభకోణం లబ్ధిదారులతో ఎన్టీఆర్ ట్రస్ట్‌ను పోల్చడం అన్యాయం. 2జి కేటాయింపు లబ్ధిదారుల నుంచి కనిమొళి ట్రస్టీగా వున్న సంస్థ విరాళాలు తీసుకుంటే... ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీ చంద్రబాబు గత 7 సంIIలుగా ప్రతిపక్షంలో ఉన్నారు. ఆయనపై ఉద్ధేశ్యపూర్వకంగా నిరాదార ఆరోపణలను చేసి, హైకోర్టును ప్రక్క దారి పట్టించడానికి ప్రయత్నించారు.

> **ట్రస్ట్‌కు భూమి కేటాయించడాన్ని సవాల్ చేస్తూ 1997లో కాంగ్రెస్ నాయకుడు రెడ్యానాయక్ దాఖలు చేసిన రిట్ పిటిషన్ నెం.13302ను 1998 సెప్టెంబర్ 12న హైకోర్టు కొట్టివేసింది. ఇదే అంశంపై దాఖలు చేసిన ఎస్.ఎల్.పి.ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇండియన్ ట్రస్ట్ చట్టం కింద నమోదైన ఎన్టీఆర్ ట్రస్ట్ ఖాతాలను క్రమం తప్పకుండా సంబంధిత సంస్థలకు సమర్పించడం జరుగుతున్నది. ట్రస్ట్ కార్యక్రమాలలో భాగంగా పేద విద్యార్థులను చదివించడం, ప్రకృతి విపత్తుల సమయంలో సహాయ కార్యక్రమాలను చేపట్టడం, బ్లడ్ బ్యాంక్ నిర్వహణ మొదలైన సేవలకు మంచి గుర్తింపు పొందింది.**

*(అనుబంధం 16)*

# చంద్రబాబు ఆస్తులపై ఆరోపణలు

## వాస్తవం

శ్రీ చంద్రబాబు నాయుడు గారి కుటుంబానికి రెండు ఎకరాల ఆస్తి ఉందని, కాని ఈ రోజు అనేక ఆస్తులు సంపాదించారని కాంగ్రెస్ వారు సంవత్సరాల తరబడి చేస్తున్న ప్రచారాన్ని మళ్ళీ ఈ కేసులో కూడా ఆరోపించారు. కాని ఈ విషయంపై ఇంతకు ముందు అనేక కోర్టులలో తన భర్త శ్రీ రాజశేఖరరెడ్డి వేసిన కేసుల విషయాన్ని, వాటిని కోర్టులు కొట్టివేయడాన్ని చెప్పకుండా శ్రీమతి విజయ కోర్టు ముందు నిజాలను త్రొక్కి పెట్టారు.

1988 సంవత్సరంలో వేసిన కర్షక పరిషత్ కేసులో అఫిడవిట్‌లో శ్రీ చంద్రబాబు తమ ఉమ్మడి కుటుంబానికి 77.40 ఎకరాల భూమి ఉందని దానిలో తనకు వచ్చిన భాగాన్ని అమ్మి నెల్లూరు జిల్లా నిండలి / వ్యాఖ్యం గ్రామాలలో 45 ఎకరాల భూమి కొన్నానని, దాని నుండి ఒక్క వేరుశెనగ విత్తనం పండిస్తే రూ.1,44,000 ఆదాయం వచ్చిందని చెప్పారు. ఈ అఫిడవిట్‌ను ఉదహరించిన శ్రీమతి విజయ దీనిని తారుమారుచేసి 'రెండెకరాలు' అని తన అఫిడవిట్‌లో కూడా వక్రీకరించారు.

శ్రీ చంద్రబాబు కుటుంబం ఈ 45 ఎకరాలను 1989లో కొని 2001లో అమ్మి వేయడం జరిగింది. కాని 2004లో పేదలకిచ్చిన భూములను కబ్జా చేసారని, ఆయనకు 315 ఎకరాల భూమి ఉందని, ఆయన పేరుపై కరెంటు కనెక్షన్ ఉందని 'సాక్షి' చేసే ప్రచారాన్నే శ్రీమతి విజయ తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. శ్రీ చంద్రబాబు కుటుంబ సభ్యులకు 45 ఎకరాలు మాత్రమే ఉన్నది. అది కూడా 2001లో అమ్మివేసారు. అందువలన 2004లో ఇచ్చిన పేదల భూమి ఆక్రమణ అనే ప్రశ్న ఉత్పన్నం కాదు. అదే విధంగా విద్యుత్ కనెక్షన్ దివంగత శ్రీ కె. చంద్రబాబునాయుడు అనే వ్యక్తి పేరు మీద ఉన్నది.

శ్రీ చంద్రబాబు కుటుంబ ఆస్తులు ఆదాయానికి మించి ఉన్నాయని దీనిపై సీబీఐ విచారణ జరపాలని శ్రీమతి విజయ వాదిస్తున్నారు. గతంలో కోర్టులు ఈ విషయంపై కోర్టులు ఇచ్చిన తీర్పులను ఆమె కోర్టు ముందుంచలేదు. అంతేకాక, కుటుంబ సభ్యుల ఆదాయాలను గురించి అందరికీ తెలిసిన విషయాలను కూడా ఆమె ప్రస్తావించలేదు. శ్రీమతి భువనేశ్వరి గారు 1977లో సంపద పన్ను రిటర్న్లు దాఖలు చేసిన విషయం, ఆమె 1995 నుండి హెరిటేజ్ సంస్థకు ఆధిపత్యం వహిస్తూ ఆదాయాన్ని పొందడం,

కుమారుడు శ్రీ లోకేష్ హెరిటేజ్ సంస్థలో పని చేస్తూ పొందుతున్న ఆదాయం.... ఏవీ పరిగణనలోకి తీసుకోలేదు. ఆస్తుల విలువ కాలక్రమేణా పెరిగిన విషయం కూడా లెక్కలోనికి తీసుకోకుండా ఆరోపణలు చేస్తున్నారు. ఉదాహరణకు శ్రీ చంద్రబాబు నివాస గృహానికి అయిన ఖర్చు అప్పట్లో రూ.23 లక్షలు. ఈ రోజు దాని విలువ రూ.12 కోట్లు. కుటుంబ సభ్యుల బ్యాంకుల నుండి తీసుకున్న అప్పులు కూడా పరిగణనలోకి తీసుకోలేదు. 2004లో రూ.1.33 కోట్లు ఉన్న అప్పులు 2009 నాటికి రూ.17.09 కోట్లుకు పెరిగాయి. అలాగే కుటుంబానికి ఉన్న ఆస్తులు, షేర్లుపై ఆదాయాన్ని కూడా మరుగున పెట్టి ఈ ఆరోపణలు చేయడం వెనుక రాజకీయ కక్ష సాధింపు స్పష్టంగా తెలుస్తుంది.

శ్రీమతి విజయ తన అఫిడవిట్‌లో శ్రీ నారా లోకేష్‌పై అనేక నిందాపూర్వక ఆరోపణలు చేశారు. ఆయనకు ఇంటర్మీడియట్‌లో 50 శాతమని, సత్యం రామలింగరాజు గారు రూ.22 కోట్లు చెల్లించి ఆయనకు సీట్లు ఇప్పించారని, ఆయన చదువుకు అయిన ఖర్చు ఆదాయపు పన్ను శాఖకు తెలుపలేదని అబద్ధపు ఆరోపణలు చేసారు.శ్రీ నారా లోకేష్ ఇంటర్మీడియట్‌లో 71% పొందిన విద్యార్థి. ఆయన ప్రఖ్యాతి పొందిన కార్నామెలన్ విశ్వవిద్యాలయంలో, స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకొన్నారు. అక్కడ చదువుతున్న రోజులలోనే ప్రఖ్యాత సంస్థల అయిన ఇక్యాపిటల్, క్రిస్లరీ, ప్రపంచ బ్యాంకు సంస్థలలో ఇంటెర్న్‌గా పని చేసారు. డబ్బుకు సీట్లు ఇచ్చే అగత్యం, సంప్రదాయం లేవని విశ్వవిద్యాలయాలు పంపిన లేఖలు తెలియజేస్తాయి. స్టాన్‌ఫర్డ్‌లోనేగాక ప్రఖ్యాతి చెందిన 'కెల్లాగ్స్' విద్యాలయంలో కూడా ఆయనకు సీటు రావడం గమనార్హం. అలాగే ఆయన చదువుకు శ్రీమతి భువనేశ్వరి గారు ఎనిమిది సంవత్సరాలలో రూ.1,46,77,635/–లు బ్యాంక్ ఆఫ్ బరోడా నుండి పంపిన లెక్కలు ఆదాయపు పన్ను శాఖకు సమర్పించిన విషయం సంవత్సరంవారీ రిటర్న్‌లో పొందుపరిచారు. శ్రీ లోకేష్ ప్రస్తుతం హెరిటేజ్ సంస్థలో రిటైల్ విభాగానికి నాయకత్వం వహిస్తున్నారు. ఈ నిజాలను చెప్పకుండా శ్రీమతి విజయ కోర్టును తప్పుత్రోవ పట్టించడానికి ప్రయత్నం చేస్తున్నారు.

## హెరిటేజ్ ఇన్‌ఫ్రా వాటాల అమ్మకంపై ఆరోపణలు

హెరిటేజ్ ఇన్‌ఫ్రాలో తమకున్న రూ.20.49 లక్షల షేర్లును హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ తమ ఆర్థిక అవసరాల కోసం రూ.35.69 కోట్లు అమ్మితే దానిని మూడు కోట్లుగా పేర్కొని కుంభకోణాలుగా పేర్కొన్నారు. హెరిటేజ్ కొన్నది 3.69 ఎకరాలు అయితే 3.00 ఎకరాలు మాత్రమే కొన్నారని మిగిలినది ఆక్రమించుకుని రెగ్యులరైజ్ చేసుకున్నారని పేర్కొన్నారు.

పారిశ్రామిక విధానంలో అందరికీ ఇచ్చే రాయితీల ప్రకారం రెడ్డీస్ ల్యాబ్స్ సంస్థకు రూ.25.89 కోట్లు, ట్యాక్స్ డిఫర్‌మెంట్ (వాయిదాలలో పన్ను చెల్లించడం) అప్పటి ప్రభుత్వం ఇస్తే శ్రీ చంద్రబాబు కుటుంబ సభ్యుల నుండి రెడ్డీస్ ల్యాబ్స్‌కు చెందిన శ్రీ సతీష్‌రెడ్డి, శ్రీమతి దీప్తి రెడ్డి ఎక్కువ ధరకు భూమి కొన్నారని 3 ఎకరాలకు రూ.3 కోట్లు చెల్లించారని శ్రీమతి విజయ ఆరోపించారు. దీనిలో కట్టిన భవనానికి నెలకు రూ.2 కోట్లు అద్దె వస్తుందని, ఆ భవనం యజమాని శ్రీ చంద్రబాబునాయుడు అని కూడా వారు

కోర్టుకు నివేదించారు. మొదటగా నాలుగు కోట్ల రూపాయిలు వాయిదాలలో చెల్లించే అనుమతి ఇచ్చినందుకు మూడుకోట్లతో భూమి ఎక్కువ ధరకు కొనుగోలు చేసారనడం తరువాత ఈ ఆస్థికి శ్రీ చంద్రబాబే యజమాని అనడం ఈ ఆరోపణలులోని నిజాలను ఎత్తి చూపుతాయి.

శ్రీ చంద్రబాబు కుటుంబంపై వారి ఆధ్వర్యంలోని హెరిటేజ్ సంస్థపై, తెలుగుదేశం పాలనలోని అనేక ప్రాజెక్టులపై శ్రీమతి విజయ ఆధారాలు లేని అనేక ఆరోపణలు తన అఫిడవిట్‌లో పొందుపరిచారు. తన భర్త శ్రీ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి 2004 నుండి అయిదున్నర సం॥లు ముఖ్యమంత్రిగా ఉండి అనేక మంత్రి వర్గ ఉప సంఘాలు, సీబీఐ దర్యాప్తులు, సభా సంఘాలు, సీబీసిఐడి విచారణలు వేసి శ్రీ చంద్రబాబును, తెదేపాను ఇరికించాలని చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని ఆమెకు తెలిసినప్పటికీ ఆమె మళ్ళీ అవే ఆరోపణలు చేసి సీబీఐ విచారణ కోరడం గమనార్హం. అఫిడవిట్‌లో చేసిన ప్రధాన ఆరోపణలకు సంబంధించిన వాస్తవాలు పరిశీలిస్తే ఈ కేసు రాజకీయ కక్ష సాధింపు కోసం, తెదేపా అధ్యక్షులు శ్రీ చంద్రబాబు ప్రతిష్ఠను ప్రజల ముందు అపఖ్యాతి కలిగించాలని చేసిన ప్రయత్నం అని ప్రస్ఫుటంగా అర్ధమవుతుంది.

శ్రీ చంద్రబాబు తల్లి శ్రీమతి అమ్మణమ్మగారిని కూడా అఫిడవిట్‌లో ప్రస్తావించడం రాజకీయాలలో విలువలు ఎలా ఉన్నాయో అర్ధం పడుతుంది. 1989లో ఆమె తన కుటుంబ సభ్యులతో కొన్న భూమి 2001లో అమ్మితే భూమి విలువలు పెరగడం వలన వచ్చిన ప్రతి ఫలంతో రెండు స్థలాలు కొని తన మనవడు శ్రీ లోకేష్‌కు ఇస్తే అది ఒక నేరంగా చిత్రిస్తున్నారు. తల్లితండ్రులు తమకున్న ఒక్క కొడుకు శ్రీలోకేష్‌కు తమ షేర్లు, భూములు బదలాయిస్తే అదొక నేరమని చెబుతున్నారు. ఈ దిగజారుడు ఆరోపణలకు అంతం లేదు.

**(*అనుబంధం 1*)**

| టీడీపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన విచారణ కమిటీలు - 23 | | | |
|---|---|---|---|
| క్ర. సం. | విచారణ పేరు | ఛైర్మన్ | విషయం |
| సభాసంఘాలు - 11 | | | |
| 1 | సభాసంఘం | శ్రీ గుర్నాథరెడ్డి | ఐమ్యాక్స్ థియేటర్‌కు భూమి కేటాయింపు |
| 2 | సభాసంఘం | శ్రీ జె.రత్నాకర్‌రావు | నిజాం షుగర్స్ ప్రైవేటీకరణ |
| 3 | సభాసంఘం | శ్రీ ఎన్.వరదరాజులురెడ్డి | విశాఖ, చిత్తూరు, ఒంగోలు కో- ఆపరేటివ్ డెయిరీ సొసైటీ |
| 4 | సభాసంఘం | శ్రీ బి.గోవర్ధన్ | హౌసింగ్‌బోర్డు భూముల కేటాయింపు |
| 5 | సభాసంఘం | | ఉపకార వేతనాల్లో అక్రమాలు |
| 6 | సభాసంఘం | శ్రీ గుర్నాథరెడ్డి | హైదరాబాద్ ఎల్.బి.నగర్‌లోని ఆటోనగర్‌లో పార్క్‌లాండ్ |
| 7 | సభాసంఘం | శ్రీ జూపల్లి కృష్ణారావు | రిపబ్లిక్ ఫోర్జ్ కంపెనీ అక్రమాలు |
| 8 | సభాసంఘం | శ్రీ గుర్నాథరెడ్డి | ట్యాంక్‌బండ్ వద్ద జలవిహార్, ఈట్‌స్ట్రీట్‌లకు అనుమతులు |
| 9 | సభాసంఘం | | సాంఘిక సంక్షేమ హాస్టళ్ళలో అవకతవకలు |
| 10 | సభాసంఘం | | ప్రాథమిక పాఠశాలల్లో కంప్యూటర్ల కొనుగోళ్ళలో నిధుల దుర్వినియోగం |
| 11 | సభాసంఘం | | నీరు-మీరు |
| న్యాయవిచారణ కమిషన్లు - 4 | | | |
| 1 | న్యాయవిచారణ | జస్టిస్ కె.సోమశేఖర్ | ఏలేరు కుంభకోణం |
| 2 | న్యాయవిచారణ | జస్టిస్ టిహెచ్‌వి చలపతి | కుప్పంలో ఇజ్రాయిల్ ప్రాజెక్టు |
| 3 | న్యాయవిచారణ | శ్రీ ఎల్.రామచెన్నారెడ్డి | రైతులు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు |
| 4 | న్యాయవిచారణ | | పనికి ఆహార పథకం |

| | | | |
|---|---|---|---|
| **మంత్రివర్గ ఉపసంఘాలు - 3** | | | |
| 1 | మంత్రివర్గ ఉపసంఘం | | విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు |
| 2 | మంత్రివర్గ ఉపసంఘం | | నగర శివార్లలో భూముల కేటాయింపు |
| 3 | మంత్రివర్గ ఉపసంఘం | | భూ ఒప్పందాలు |
| **ప్రభుత్వ ఉన్నతాధికారుల విచారణలు - 4** | | | |
| 1 | ప్రత్యేక ప్రధాన కార్యదర్శి | | ఆప్కాబ్ |
| 2 | సీనియర్ ఐఏయస్ అధికారి | | బలహీనవర్గాల గృహనిర్మాణ కార్యక్రమం |
| 3 | సీనియర్ ఐఏయస్ అధికారి | | పౌరసరఫరాల నిధుల మళ్ళింపు |
| 4 | స్పెషల్ చీఫ్ సెక్రటరీ | శ్రీ రఘోత్తమరావు | గుంటూరులో దేవాలయ భూముల కొనుగోళ్ళు |
| **సీబీసీఐడీ విచారణ - 1** | | | |
| 1 | సీబీసీఐడీ | | కోనసీమ విద్యుత్ ప్రాజెక్టు |